దేవుడు - జీవుడు - ప్రకృతి

హేతుబద్ధంగా - వైజ్ఞానికంగా

God - Soul - Nature
Rationally - Scientifically



మహర్షి దయానంద సరస్వతి

1824 -1883

వివరణ :

సుమ్నార్థి

(డా॥ కోడూరి సుబ్బారావు)

గాయత్రీ ఆశ్రమ ట్రస్టు ప్రచురణ

సీతాఫలమండి, సికిందరాబాదు - 61

గాయత్రీ గ్రంథమాల : **62**

దేవుడు - జీవుడు - ప్రకృతి

ప్రథమ ముద్రణ : ప్రతులు **1000**
ద్వితీయ ముద్రణ : ప్రతులు **1000**

సృష్టి సంవత్సరం : **1,97,29,49,124**
విక్రమాబ్దము :
దయానందాబ్దము :
కలియుగ సంవత్సరం :

మూల్యము : రూ. /- మాత్రము (పోస్టు ఖర్చులు అదనం)

ప్రతులకు :

1. **గాయత్రీ ఆశ్రమ ట్రస్టు,** ఆర్య సమాజము-మేడిబావి
   12-10-586/6, ఇందిరానగర్, రోడ్ నెం. 2,
   వారాసిగూడ, సికిందరాబాదు - 500 061.
   కార్యదర్శి: కె.పి. నర్సింగరావు
   సెల్: 98480 11073, 9908994084
2. **ఆర్య సమాజ మందిరము - సీతాఫలమండి,**
   సికింద్రాబాద్ - 500 061.
   ఫోన్: 040-27071816, 69990967, 92461 74018
3. **పం. మురళీ బ్రహ్మచారి,** జూలమ్మ గుడి ఎదురుగా,
   రెజిమెంటల్ బజార్,
   సికింద్రాబాద్, ఫోన్ : 9441033702

ఈ లఘు గ్రంథంలో .....

దేవుడు

1. ఎవరిని దేవుడనాలి?
2. ఆధునిక వైజ్ఞానికుల దృష్టిలో 'దేవుడు'

జీవుడు

3. జీవులు ఎలా ఉంటారు? ఎలా గుర్తించాలి?
4. మనకు మూడు శరీరాలున్నాయి?

ప్రకృతి

5. ప్రకృతి అంటే పరమాణువులేనా?
6. అఘమర్షణ సూక్తం – పరమాణువులు సృష్టిగా ఎలా మార్పు చెందుతాయి

త్రైతవాదం

7. వేదం త్రైతవాదాన్ని ప్రతిపాదిస్తుంది
8. మన శరీరంలో త్రైతవాదం – పూర్తిగా వైజ్ఞానికము
9. ముగింపు మాటలు

ప్రకాశకీయము

సుమారు 7 సంవత్సరాల క్రిందట నేను **"దేవుడు – జీవుడు – ప్రకృతి"** అను పేరుతో చిన్న పుస్తకం ప్రచురించాను. అది చిన్న పుస్తకమే అయినా ఈ మూడింటి గురించి చక్కటి అవగాహన కలిగించింది. అది వైజ్ఞానికంగా కూడా ఉండటంవల్ల నేటి యువతకు బాగా నచ్చింది. ఆ పుస్తకాలన్నీ అయిపోయి చాలా కాలమయ్యింది.

సీతాఫలమండి, ఆర్య సమాజమువారు నెలనెలా ప్రచురించి వితరణ చేస్తున్న కరపత్రాల రూపంలో కూడా ఇది ఉంది. కీ.శే. పం. వంకం సుబ్బన్న గారి స్మృతిలో వారి కుమార్తె శ్రీమతి పద్మావది గారు ప్రచురించిన 'వేదార్థ విజ్ఞానం' అనే పుస్తకంలో కూడా ఈ విషయాలు ప్రచురించడం జరిగింది. కావున ఈ చిన్న పుస్తకాన్ని మళ్ళీ విడిగా ముద్రించడం ఎందుకని పునర్ముద్రణ చేయలేదు.

శ్రీ బి.కె. భాస్కరరావు గారు, విజయనగరం జిల్లా వాస్తవ్యులు సుమారు గత 5, 6 సంవత్సరములుగా వైదిక సిద్ధాంతాలను, యజ్ఞాలను జిల్లాలో విరివిగా ఆన్‌లైన్ క్లాసుల ద్వారాను, సత్సంగాల ద్వారాను ప్రచారం చేయుచున్నారు. వారికి ఈ పుస్తకం బాగా నచ్చింది. వారు ఈ పుస్తకాలను అధిక సంఖ్యలో తెప్పించుకొని ఆ ప్రాంతంలో వితరణ చేశారు. మరొక 100 పుస్తకాలు పంపమని మిక్కిలిగా కోరారు. కావుననే ఈ పుస్తకాన్ని పునర్ముద్రణ చెయ్యవలసి వచ్చింది.

పుస్తకంలో విషయం ఎంత మంచిదైనా అట్ట కూడా, అందంగా, ఆకర్షణీయంగా రంగు రంగులతో ఉంటేనే బాగుంటుందని మిత్రుల ప్రోద్బలము మేరకు ఆ ప్రయత్నం కూడా చేయనైనది.

బుధజన విధేయుడు

సుమ్నార్థి

గేయము

రచయిత : **భావజుల కుమారస్వామి (భావశ్రీ)**

త్రైత సిద్ధాంతము

("గున్నమామిడి కొమ్మమీద గూళ్ళు రెండున్నాయి" మాదిరి)

వేదమంత్రము: **"ఓం ద్వాసుపర్ణా సయుజా సఖాయా**
సమానం వృక్షం పరిషస్వజాతే ।
తయోరన్యః పిప్పలం స్వాద్వీత్యనశ్న
న్నన్యోభిచాకశీతి ॥" - ఋగ్వేదము 1-164-20

సృష్టియనెడి వృక్షముపై పక్షులు రెండున్నాయి,
అందొకటేమో ఫలముల భక్షించు
మరియొకటి తినకయే వీక్షించు. ॥సృష్టియనెడి॥

ఒక పక్షి జీవుడని మరొక పక్షి దేవుడని,
కాగా, యీ వృక్షము కార్యంగా ప్రకృతియని,
జీవుడు, దేవుడు చేతనము,
మరి కారణ ప్రకృత్య చేతనము,
జీవ, దేవ, ప్రకృతులు నీమూడును,
సృష్టికి మూలమని తెలియాలి. ॥సృష్టియనెడి॥

జీవుండల్పజ్ఞుడని, దేవుడు సర్వజ్ఞుడని,
జ్ఞానంలో భేదమైనా, చేతనులుగ నొక్కటని,
దేవజీవుల సంబంధం పితాపుత్రుల బోలిన యనుబంధం,
దేవ, జీవ, ప్రకృతుల నీరీతిగ,
దెల్పె మనకు వైదిక సిద్ధాంతం ॥సృష్టియనెడి॥

మనిషికి జిజ్ఞాస అవసరం (Foreword)

జిజ్ఞాస అంటే– తెలుసుకోవాలనే కోరిక. అది బలంగా ఉంటేనే జిజ్ఞాస అవుతుంది. లేకుంటే సామాన్య కోరికగానే ఉంటుంది. జిజ్ఞాస కలిగిన వ్యక్తి తనకు అభిరుచి గల విషయాలలో అందుకు తగిన గురువులను, గ్రంథాలను వెతుకుతాడు. వారిని సమీపించి గాని, ఉత్తర ప్రత్యుత్తరాలతోగాని, ఫోనులో సంభాషించి గాని తెలుసుకుంటాడు. అందుకు తగిన గ్రంథాలను చదువుతాడు – మననం చేస్తాడు. తాను స్వయంగా స్వబుద్ధితో ఆలోచిస్తాడు. సత్యా సత్యాలను వేరు వేరుగా చూడగలుగుతాడు. అయితే కొందరు సత్యాన్ని గట్టిగా పట్టుకోవడానికి సాహసించరు. అసత్యాన్ని వదలటానికి కూడా సంకోచిస్తారు. అట్టివారు నిజమైన జిజ్ఞాసువులు కారు. వారు పెద్దగా ఉన్నతి చెందరు. అందుకనే దయానంద మహర్షి తాము స్థాపించిన ఆర్య సమాజానికి 4వ నియమంగా "సత్యాన్ని గ్రహించటానికి, అసత్యాన్ని త్యజించటానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉండా"లని సూచించారు. ఈ సత్యనిష్ఠ ముఖ్యంగా ఆధ్యాత్మిక విషయాలలో ఉండాలి. అదే మనిషికి ఆత్మోన్నతిని కలిగిస్తుంది.

పై నియమాన్ని గట్టిగా పాటించటం వల్లనే దయానంద మహర్షి వేదాల యథార్థ స్వరూపాన్ని తెలుసుకోగలిగారు. వాటిని జనబాహుళ్యానికి అందజేయగలిగారు. కనుకనే నేడు స్త్రీ శూద్రులంతా వేదాలను చదువగలుగుచున్నారు. వినగలుగుచున్నారు. సృష్టికర్త యిచ్చిన జ్ఞాన విజ్ఞాలను తెలుసుకోగలుగుచున్నారు. సామాజిక నియమాలను తెలుసుకొని ఎన్నో మూఢ నమ్మకాలను వదులుతున్నారు. స్త్రీలకు విద్యా సత్కారాలు లభిస్తున్నాయి. వారు కూడా ఎన్నో రంగాలలో ఉన్నతి చెందుచున్నారు. దయానంద మహర్షి సాహిత్యం నేటికినీ వివేకవంతులకు మార్గదర్శనం చేస్తున్నది. నాకును ఆ "సత్యార్థ ప్రకాశ, ఋగ్వేదాది భాష్య భూమికాది" గ్రంథాలే సత్యమార్గం చూపాయి. పూర్వజన్మలోని సంస్కారాలవల్ల కావచ్చు నాలో కొద్దిగా వివేకం, జిజ్ఞాస ఉన్నాయి. దానితో వేదమార్గంలోనికి రాగలిగాను. నేను చదువుకున్నది తక్కువైనా, ఆరోగ్యం

అనుకూలించకున్నా జిజ్ఞాస ఉండబట్టే కొంత వైదిక సాహిత్యాన్ని చదివాను. మనన చింతనలు చేశాను. నాకు అర్థమైన విషయాలను సత్సంగాలలో చెప్పగలిగాను. ఇప్పుడు కొన్ని చిన్న పుస్తకాలు, కరపత్రాలు వ్రాయగలుగుచున్నాను. వాటిని చదివిన కొందరు వివేకవంతులు వేదమార్గంలోనికి వస్తున్నారు. అట్టివారిలో విశాఖపట్నం వాసులు శ్రీ తిరుమల లక్ష్మణరావు గారు ఒకరు. వారి పరిచయం వెనుక పుటలో ఉంది.

శ్రీ తిరుమల లక్ష్మణరావు గారి సంక్షిప్త పరిచయం

వీరు విశాఖపట్నం షిప్‌యార్డులో టెక్నికల్ సూపర్ వైజరుగా పనిచేస్తున్నారు. పాత గాజువాకలో ఇల్లు కట్టుకొని దానికి “పాతంజలి నిలయం” అని పేరు పెట్టుకున్నారు. అంటే – వారికి యోగసాధన మీద అంత అభిరుచి అన్నమాట. వైదిక పురోహితులు శ్రీ పాతూరి రాధాకృష్ణారావు (మండపేట వాసులు) గారి ద్వారా యోగా నేర్చుకున్నారు. వారి ద్వారానే వేదాల పరిచయం, వైదిక గ్రంథాల, వైదిక విద్వాంసుల పరిచయం కలిగాయి. శ్రీ లక్ష్మణరావు గారిలో వివేకం, జిజ్ఞాస ఎక్కువగా ఉన్నందువల్ల వారికి సమయం ఎక్కువ లేకున్నా చాలా గ్రంథాలు చదివారు. ఆ విషయాలను మనన చింతనలు చేశారు. వేదమార్గమే సరియైన మార్గమనే సత్యాన్ని గ్రహించారు. విగ్రహారాధన, మృతక శ్రాద్ధ తర్పణాది మూఢనమ్మకాలన్నిటినీ వదిలిపెట్టి అంతర్యామిని సేవించడం మొదలుపెట్టారు. వారు చదివిన వైదిక గ్రంథాలలో నేను వ్రాసిన పుస్తకాలే ఎక్కువగా నచ్చాయంటూ పెద్ద పెద్ద ఉత్తరాలు వ్రాస్తూ ఉంటారు. ఋషి ఋణం తీర్చుకోవాలంటూ, సత్పాత్రదానం చేసుకోవాలంటూ అప్పుడప్పుడు కొంత ధనాన్ని పంపుతూ ఉంటారు. నేను దానిని నా ఆశయాల మేరకు వినియోగిస్తూ ఉంటాను. వారు ఏమంటారంటే...

“వేదాలలోని సత్యజ్ఞానాన్ని ఆధునిక విజ్ఞాన వేత్తల ఋజువులతో సరిజోడించి మీరు వ్రాసే వేదమంత్రార్థాలు మాకు బాగా అర్థమౌతున్నాయి. వేదమంత్రాలు పెళ్ళిళ్ళకో, చావులకో మాత్రమే పరిమితం కాదని తెలుస్తున్నది. అవి మానవమాత్రులందరికి భౌతిక సామాజిక ఆత్మిక ఉన్నతులను కలిగించేవని తెలుసుకున్నాను. వీటిపై యూనివర్సిటీలలో పరిశోధనలు Ph.D.లు చేయిస్తే

చాలా బాగుంటుంది. నిగూఢమైన వేదజ్ఞానాన్ని సామాన్యులకు అర్థమయ్యేటట్లు సరళంగా స్పష్టంగా సంక్షిప్తంగా ఉన్న మీ రచనలు నాస్తికులకు, ఆధునిక విజ్ఞానవేత్తలకు, సత్యాన్వేషకులకు కూడా కనువిప్పు కలిగించేవిగా ఉన్నాయి. ఆలోచింపచేసేవిగా ఉన్నాయి" అంటూ 2 పెద్ద ఉత్తరాలు వ్రాశారు.

కనుక మిత్రులారా! మనిషికి జిజ్ఞాస అవసరం. సృష్టికర్త మనకిచ్చిన గొప్ప అంతరింద్రియం బుద్ధి. దానిని ఎంత పదును పెట్టుకుంటే అంతగా మనకు ఉన్నతి కలుగుతుంది. ఆ ఉన్నతులలో ఆత్మికోన్నతియే అన్నిటికన్న గొప్పదని ఋషులంటారు. ఈ గ్రంథ ముద్రణకు సహకరించిన వారందరికి నా ధన్యవాదాలు. పాఠకులందరికి శుభాకాంక్షలు.

– సుమ్నార్థి

(డా. కోదూరి సుబ్బారావు)

దేవుడు (God)

ఎవరిని 'దేవుడు' అనాలి? దేవుని నిర్వచనమేమి?

What is the definition of GOD?

ఆధ్యాత్మిక దృష్టితో లోకంలో ఉండే మానవులందరిని రెండు వర్గాలుగా విభజించవచ్చు. మొదటి వర్గం ఆస్తికులు. రెండవ వర్గం నాస్తికులు. ఆస్తికులంటే సృష్టి స్థితి ప్రళయాలు చేసే కర్త ఒకడున్నాడని నమ్మేవారు. నాస్తికులంటే అట్టి కర్త ఎవ్వరూలేరు, ప్రకృతిలో నెలకొన్న శాశ్వత నియమాల వల్లే సృష్టి స్థితి ప్రళయాలు జరుగుతున్నాయని వాదించేవారు, నమ్మేవారు. ఈ చిన్న పుస్తకంలో నాస్తికులను ప్రక్కకుపెట్టి ఆస్తికుల అభిప్రాయాలను సమీక్షిద్దాము.

"అథాతో బ్రహ్మ జిజ్ఞాసా" అంటూ ప్రారంభమౌతుంది వేదాంత దర్శనం. అంటే – (అథ+అతః+బ్రహ్మ జిజ్ఞాసా) ఇప్పుడు మనం తర్కంతో దేవుని సిద్ధింపచేద్దామని అర్థం. అథ అనే పదం శాస్త్ర ప్రారంభాన్ని సూచిస్తుంది. పూర్వం ఇది మంగళాచరణంగా – ప్రార్థనగా కూడా ఉండేది. అతః అంటే అందువలన – తర్కించటానికి తగిన విద్యా సదాచారాలు, అహింసా సత్యాది వ్రతాలు సలిపి యోగ్యత పొందినందువలన బ్రహ్మను గురించి, దేవుని సత్య స్వరూపాన్ని గురించి తర్కించి తెలుసుకుందామని భావం.

రెండవ సూత్రంగా **"జన్మా ద్యస్య యతః (జన్మ+ఆది+అస్య యతః)"** అన్నారు. అంటే ఎవనిచే ఈ ప్రత్యక్షాది ప్రమాణాలచే తెలియబడే జగత్తు యొక్క జన్మ మొదలగునవి జరుగుచున్నాయో అతడు దేవుడు అని అర్థం. ఇక్కడ జన్మాదులు అంటే సృష్టి ప్రాదుర్భావం తదుపరి 432 కోట్ల సంవత్సరాలు దాని స్థితి, అనంతరం 432 కోట్ల సంవత్సరాలు ప్రళయం అని భావం. ఈ మూడింటిని (సృష్టి స్థితి ప్రళయాలను) చేసేవాడే దేవుడు అని వ్యాసమహర్షి ప్రతిపాదించారు. ఇంతేగాక, శాస్త్రాలకును అతడే కారణమంటూ మూడవ సూత్రంలో **"శాస్త్ర యోనిత్వాత్"**

అన్నారు. అంటే ఆది మానవులకు జ్ఞాన స్రోతస్సులైన ఋక్ యజు సామ అథర్వ శాస్త్రాలకును బ్రహ్మయే - దేవుడే కారణమని అర్థం. ఉపనిషత్తులలోనూ ఇట్లే చెప్పబడింది-

"యతో వా ఇమాని భూతాని జాయన్తే యేన జాతాని జీవన్తి
యత్ ప్రయం త్యభిసంవిశంతి త ద్విజిజ్ఞాసస్య తద్బ్రహ్మ"

-తైత్తిరీయోపనిషత్ 3-1

ఈ సందర్భంలో మన పోతనాచార్యులవారు చేసిన దైవ ప్రార్థన స్మరించతగినది - **"ఎవ్వనిచే జనించు జగము, ఎవ్వని లోపల నుండు, లీనమై ఎవ్వనియందు డిందు, పరమేశ్వరుడెవ్వడు, మూలకారణం బెవ్వడు, అనాది మధ్య లయు డెవ్వడు సర్వము దానయైన వాడెవ్వడు వానిన్ ఆత్మభవున్ ఈశ్వరునే శరణంబు వేడెదన్".** అన్నారు.

పై 'శాస్త్రయోనిత్వాత్' అనే సూత్రంలోని శాస్త్ర పదమునకు శంకర రామానుజాది ఆచార్యులంతా ఋగ్వేదాది శాస్త్రాలనియే అర్థం వ్రాశారు. అవి సృష్టికర్త మానవులకు ప్రసాదించిన జ్ఞాననిధులన్నారు. మనం యుక్తితో తర్కంతో ఆలోచించినా అంతే. ఎట్లంటే -

మనం సీతాఫలమండి ఆర్యసమాజం వారు వితరణ చేసిన పూర్వ కరపత్రాలలో తెలిసికొన్నట్లుగా మానవుని ప్రాథమిక జ్ఞానం నైమిత్తకం - ఇతరుల సహకారంతోనే కలుగుతుంది. వారిలో తల్లి, తండ్రి, ఆచార్యులు (గురువులు, ఉపాధ్యాయులు) ప్రధానంగా ఉంటారు. మరి ఆదిమానవులకు ఎవరుంటారు? కనుక జ్ఞానం సృష్టికర్త నుండే వస్తుంది. ఈ విధంగా మన తత్వశాస్త్రాలు దేవుని జ్ఞానదాతగా చెబుతూ ఉంటే కొన్ని గ్రంథాలు దేవుడు జ్ఞానఫలాలను తినవద్దని శాసించాడనీ, ఆ శాసనాన్ని ఉల్లంఘించటంవల్ల ఆది మానవులు పాపులయ్యారనీ అంటారు. ఇంతేగాక, వారి సంతానం, తరతరాల సంతానం జన్మతోనే పాపులౌతారంటారు. ఎంత విడ్డూరంగా ఉందో చూడండి. పాపం చేస్తే పాపులౌతారు కాని పాపులకు పుట్టినంత మాత్రాన పాపులౌతారా?

ఇక ప్రాణి సృష్టి అయితే నిరంతరం (సృష్టి కాలమంతా) జరుగుతూనే ఉంటుంది. ప్రతీక్షణం ఎన్నో ప్రాణులు పుడుతూనే ఉంటాయి. కొంతకాలం జీవించి

మరణిస్తూనే ఉంటాయి. ఈ ప్రాణి సృష్టి స్థితి ప్రళయాలు చేస్తున్నది కూడా సృష్టికర్తయైన దేవుడే. వీటితోబాటు మానవులు చేసే పాపపుణ్య కర్మలకు అత్యంత న్యాయంగా ఫలాలనిస్తున్నదియును సృష్టికర్తయే. అయితే ఆ ఫలాలు కొన్ని త్వరగాను, కొన్ని ఆలస్యంగాను కలుగుతాయి. కొన్నిటికి రాబోయే జన్మలవరకు వేచి ఉండాలి. ఇన్ని పనులు నిరంతరంగా జరగాలంటే సృష్టికర్త సర్వ వ్యాపకుడై ఉండాలి. ఎక్కడో ఒక ప్రత్యేకస్థానంలో ఉండి చేయటం అసంభవం. కర్త ఒకచోట కర్మ ఒకచోట జరగటం అసంభవమంటాయి మన తత్వశాస్త్రాలు. నేడు రిమోట్‌తో జరిగే పనులు కూడా సూక్ష్మ విద్యుత్ తరంగాలు అనే సాధనంతోనే (పనిముట్టుతోనే) జరుగుతున్నాయి. బ్యాటరీ అయిపోతే అవి జరుగవు కదా!

అందుచేతనే వేదం అతి స్పష్టంగా **"ఈశావాస్యమిదం సర్వం యత్కించ జగత్యాం జగత్"** (యజు. 40.1) అంటుంది. మన దర్శన ఉపనిషదాదులన్నీ ఇట్లే చెబుతాయి. ''ఇందుగల దందులేదని సందేహము వలదు, చక్రి సర్వోపగతుండు" అంటాడు మన పోతనాచార్యులవారు. మరొక విషయం కూడా మనకు స్పష్టంగా అర్థం కావలసి ఉంది. దుష్టశిక్షణ శిష్టరక్షణ కొరకు దేవుడవతరిస్తాడనే అవతారవాదం మధ్యకాలంలో వచ్చిందేకాని అర్వాచీనంకాదు. వైదికం అసలే కాదు. ఎంత దుష్టులైన రావణ కంస జరాసంధ నరకాసురాదులైనా దేవుడు సర్వవ్యాపకుడు కనుక వారి గుండెను నిలిపివేస్తే క్షణంలో చస్తారు. అందుకొరకు జన్మించి (అవతరించి) నానా అవస్థలు పడటమెందుకు? జన్మిస్తే ఆధ్యాత్మిక ఆధిభౌతిక ఆధిదైవిక దుఃఖాలు తప్పవు కదా!?

పై ప్రశ్నకు చక్కటి వివరణ యిస్తుంది వేదాంత దర్శనం. దానిలోని 2వ అధ్యాయం ద్వితీయ పాదంలోని 6వ అధికరణాన్ని 'పత్యధికరణమ్' అంటారు. దీనిలో వారు సాకారేశ్వరవాదాన్ని ఖండిస్తూ 5 సూత్రాలు వ్రాశారు. వాటిలోని ఒక సూత్రంలో ఏమన్నారంటే –

"కరణవచ్చే న్న భోగాదిభ్యః (కరణవత్+చేత్+న, భోగాదిభ్యః) = దేవునికి శరీరం వుంటే (లేదా శరీరంలోనికి వస్తే) సుఖదుఃఖాల అనుభవం, పాపపుణ్యాల బంధం కలుగుతాయి. కనుక ఈ ఆలోచన సరియైనది కాదు" అన్నారు. దీనికి ఆదిశంకరాచార్యులవారు తమ ప్రస్థానత్రయ భాష్యంలో చక్కటి విశ్లేషణ యిచ్చారు. వారి సంస్కృత భాష్యం యథాతథంగా యిచ్చుట పొందుపరుస్తున్నాము.

"అథ లోకదర్శనాను సారేణ ఈశ్వరస్యాపి కించిత్ కరణానా మాయాతనం కామేన కల్ప్యేత! ఏవమపి నోపపద్యతే, స శరీరత్వే హి సతి సంసారివద్ భోగాది ప్రసంగాత్. ఈశ్వర స్యాప్యనీశ్వరత్వం ప్రసజ్యేత."

అంటే – లోకంలో చూస్తున్నట్లు ఈశ్వరునకు శరీరం కల్పిస్తే సంసారివలె అతనికి కూడా భోగప్రసక్తి కలుగుతుంది. సుఖదుఃఖాల ననుభవించవలసిన వాడౌతాడు. అనుభవిస్తే దోషమేమిటంటే అప్పుడతడు ఈశ్వరుడు (దేవుడు) కాలేడు. కనుక సుఖదుఃఖాలకు లోనయ్యేవాడు దేవుడు కాడు, అని శంకరాచార్యుల వారి వివరణ.

అల్పజ్ఞులమైన మనం దేవుడు మనలాగానే ఉంటాడనుకుంటారేమోనని తన అసలు స్వరూపాన్ని దేవుడు వేదాల ద్వారా స్పష్టంగా చెప్పాడు **– స పర్యగాత్ శుక్రమ్ అకాయం అవ్రణం అస్నావిరం శుద్ధం అపాపవిద్ధం.** (యజుర్వేదం 40–8)

"ఓ మానవులారా! నేను అంతటా వ్యాపించి ఉన్నాను. సర్వశక్తిమంతుడను, సృష్టి కార్యాలలో నాకెవ్వరి సహకారం అక్కరలేదు. నాకు శరీరం లేదు. వ్రణాలు లేవు. అస్నావిరం = నాకు మీవలె నాడులతో బంధం లేదు. ఏ తల్లి గర్భంలోకి రాను, సదా శుద్ధుడను" అని వివరించాడు.

లోకంలో ఎవరైనా గొప్ప వ్యక్తి సామాన్య మానవులు చేయలేని గొప్ప పనులు చేస్తే అతనిని దేవుడనీ లేదా అవతారమనీ ప్రజలు భావిస్తారు. ఆరాధిస్తారు. ఈ మధ్య గురువులను కూడా దేవుని అవతారాలంటున్నారు! విచిత్రంగా. ఇంద్రజాల విద్యతో మహిమలు ప్రదర్శించేవారిని కూడా దేవుళ్ళే అంటున్నారు! ఇదీ నేటి లోక స్థితి.

మనం విద్యావంతులము, వివేకవంతులము కనుక దేవుడు చెప్పిన మార్గాన్ని (వేదమార్గాన్ని), ఋషుల మార్గాన్ని అనుసరించటమే సర్వశ్రేష్ఠం. మీరేమంటారు?

Who is God?

G = Generator
O = Operator } of the Universe
D = Destructor

ఆధునిక వైజ్ఞానికుల దృష్టిలో దేవుడు

చాలా సంవత్సరాల క్రిందటి మాట – దేవుణ్ణి గురించి ఆధునిక వైజ్ఞానికులేమంటారో తెలుసుకోవాలని ఒక సైన్సు గ్రంథాల రచయితకు జిజ్ఞాస కలిగింది. ఆయన ఆనాటి ప్రపంచ వైజ్ఞానికులను కలిసి తన సంకల్పాన్ని చెప్పి మీ మీ అభిప్రాయాలను వ్యాసరూపంలో వ్రాసి పంపమని కోరాడు. ఒకే సైన్సు విభాగానికి చెందినవారిని కాకుడా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జూవాలజీ, భూగర్భ, కృషి, వృక్ష – వనస్పతి, పర్యావరణాది విజ్ఞానవేత్తలను కోరటం జరిగింది. కొందరు సృష్టి రచనలో దేవుని ప్రమేయం ఉందనీ, కొందరు అటువంటి దేమీలేదని వ్రాశారు. అందులో దేవుణ్ణి (ఒక అదృశ్య అద్భుతశక్తిని) అంగీకరించే వారి అభిప్రాయాలను ఒకచోట చేర్చి – "The evidence of GOD in expanding universe" అనే పేరుతో 40 మంది వైజ్ఞానికుల వ్యాసాలను ఒక పుస్తకంగా ప్రచురించాడు. ఈ పుస్తకాన్ని హిందీ భాషలోనికి అనువదింపచేసి “దయానంద సంస్థాన్, ఆర్య సమాజ్ మార్గ్ – (2286), కరోల్‌బాగ్, నయీ దిల్లీ – 110 005” వారు కూడా ప్రచురించారు. తెలుగు అనువాదం ఎవరైనా వ్రాసి ప్రచురించారేమో తెలియదు.

ఆ వ్యాసాలలో ప్రఖ్యాత రసాయన (కెమిస్ట్రీ) శాస్త్రవేత్త డా. థామస్ డేవిడ్ పార్క్స్ గారి అభిప్రాయాలు చాలా ఆకర్షణీయంగాను, నాస్తికులను కూడా ఆలోచింపచేసే విధంగాను ఉన్నాయి. దానిలోని కొన్ని ముఖ్య విషయాలను ఇక్కడ తెలుసుకుందాము. సంక్షిప్తంగా ఆ శాస్త్రవేత్త పరిచయమేమంటే ఆయన ‘ఆయ ఇలినోయ’ విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి పొందిన వ్యక్తి, స్టాన్‌ఫోర్డ్ పరిశోధనా సంస్థ (Stanford Research Centre) లో రసాయన విభాగ అధ్యక్షునిగా (Head of the Department) పని చేసినవాడు. వ్యాసం వ్రాసేటప్పుడు క్లోరోక్స్ కెమికల్ కంపెనీలో పరిశోధకునిగా (సైంటిస్టుగా) పనిచేస్తున్నాడు. మైక్రో కెమిస్ట్రీ, ఎలెక్ట్రోలైటిక్ ఫినోమినా, ఎక్స్‌రే డిఫెక్షన్ మొదలైన విషయాలలో కూడా అనుభవమున్న గొప్ప విజ్ఞానవేత్త.

ఆయన ఏమన్నారంటే – “మనం మనచుట్టూ ఉండే ఈ జగత్తును నలువైపులా పరికించి చూచినట్లైతే సృష్టిలో అంతటా ఒక నియమబద్ధత, ప్రయోజనం కనబడుతుంది. ఇవన్నీ ఈ విధంగా వాటంతట అవే ఏర్పడ్డాయంటే

నేను నమ్మలేకపోతున్నాను. వీటన్నిటి వెనుక నాకు అనంత శక్తి సామర్థ్యాలు గల బుద్ధితత్త్వం (చేతనతత్త్వం – అనంత జ్ఞానం గల తత్త్వం) కనబడుతున్నది. ఆ బుద్ధితత్త్వాన్నే నేను దేవుడు (పరమాత్మ) అంటున్నాను" అన్నారు.

ఈ విషయాన్ని తన రసాయన శాస్త్రంతో (కెమిస్ట్రీతో) వివరిస్తూ – "ప్రతీ రసాయన తత్త్వవేత్త తత్త్వాల కలయిక వెనుక నియతకాలిక వ్యవస్థ ఉంటుందని నమ్ముతాడు. ప్రతీ పదార్థంలోనూ క్రమబద్ధత, నియమబద్ధతతోపాటు ఒక ప్రయోజనం కొరకు అది నిర్మింపబడినట్లు కనబడుతుంది. ఇదంతా అకస్మాత్తుగా ఏర్పడింది కాదు. అనంత జ్ఞానం గల ఒక సర్వవ్యాపర అదృశ్యతత్త్వం దీనిని నిర్మిస్తున్నది. ఆ తత్త్వంలో సర్వప్రాణిహితము, కల్యాణము సమావిష్టమైనట్లు కనబడుతుంది. ఈ సృష్టిలో పొరబాటుకాని, న్యూనత (లోపం) కాని కనబడదు. అట్టి సర్వవ్యాపక జ్ఞానతత్త్వాన్నే నేను 'దేవుడు' అంటున్నాను. నా ఈ ప్రతిపాదనను నిరూపించటానికి ఒక చక్కటి ఉపమానాన్ని చూపిస్తాను –

ఉదాహరణకు : అందరికి అందుబాటులో ఉండే సర్వ సౌలభ్యమైన నీటినే తీసుకోండి. దాని అణుభారం (H_2O) కేవలం 18 మాత్రమే. ఇంత తక్కువ అణుభారం కలిగిన మరే మూలకమూ – ఎలిమెంటూ సామాన్య తాపమానంలో ద్రవరూపంలో ఉండలేదు. వాయురూపం చెందిపోతుంది. కాని, నీరు సామాన్య తాపమానంలో ద్రవరూపంలో ఉండటం మనం చూస్తున్నాం. ఫార్ములా ప్రకారం అమ్మోనియా మూలక అణుభారం 17. అది కేవలం – 33^0 సెంటీగ్రేడ్ వద్దనే వాయురూపం చెందిపోతుంది. అట్లే, రసాయనిక కాలక్రమ పట్టిక ననుసరించి మరొక మూలక సమ్మేళనం హైడ్రోజన్ సల్ఫైడుకు, నీటికి దగ్గర సంబంధం ఉంది. దాని ఫార్ములా భారం 34. అది – 59^0 సెంటీగ్రేడ్ తాపమానంలోనే వాయురూపం చెంది గాలిలో కలిసిపోతుంది. కాని, నీరు సామాన్య తాపమానంలో కూడా ద్రవంగానే ఉండటం రసాయనశాస్త్ర విజ్ఞానం తెలిసిన వారందరికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఆలోచింపచేస్తుంది. నీటిని నిర్మించిన సృష్టికర్త అద్భుత మేధావి అనిపిస్తుంది. ఇంతేకాదు, నీటిలో మరెన్నో విశేష గుణాలున్నాయి.

సర్వ సౌలభ్యమైన నీరు భూమిలో ఇంకి భూగర్భ జలంగా నిలువ ఉంటుంది. మట్టిలోని రసాయనాలను తనలో కలుపుకొని అది వృక్షముల వ్రేళ్ళ ద్వారా పీల్చబడినపుడు వాటికి నీటితోబాటు ఆహారాన్ని కూడా అందజేస్తుంది. ఇట్లే,

మన శరీరంలోనూ జీర్ణమైన ఆహారసారాన్ని నీరు తనలో కలుపుకొని ప్రతీ కణానికి నీటితోబాటు ఆహారాన్ని అందజేస్తుంది. మరల కణాలవద్ద తయారైన మురికిని (యూరిక్ యాసిడ్ మొదలైన వాటిని) తనలో కలుపుకుని మూత్ర పిండాలకు, స్వేదరంధ్రాలకు చేర్చి బయటకు వెడలగొడుతుంది. మన శరీరాన్ని ఆరోగ్యంగానూ, బలంగాను, మృదువుగాను, ఆర్ద్రంగాను ఉంచుతుంది. ఇళ్ళు శుభ్రం చేసుకోవటానికి, బట్టలు, పాత్రలు మొదలగునవి శుద్ధి చేసుకోవటానికి నీరు ఎంతగా ఉపయోగపడుతుందో మీ అందరికి అనుభవైక వేద్యమే కదా! అందుకనే వైజ్ఞానికులు నీటిని Best Dissolvent అంటారు. నీటిని గురించి మరెన్నో విశేషాలు నా రచన "వేదాలలో జలచికిత్స" అనే గ్రంథంలో చూడండి.

సామాన్యంగా నీరు మనకు 3 రూపాలలో కనబడుతుంది. 0^0C వద్ద గడ్డకట్టి మంచు (ICE) రూపంలోనూ, సామాన్యతాపమానంలో ద్రవంగాను, 100^0C గా చేస్తే వాయువుగాను (నీటియావిరిగాను) కనబడుతుంది. ఈ భూమిపై నాలుగింట మూడుపాళ్ళు జలంతో కప్పబడి (సముద్రాలుగా, సరస్సులుగా etc. గా) ఉంది. గాలిలో నీటియావిరిగా, తేమగా, మేఘాలగా కూడా నీరు ఉంటుంది. వాతావరణంలో ఇదిలేకుంటే తాపమానంలో ఎంతటి హెచ్చుతగ్గులు, విపరీతాలు వస్తాయో ఊహించలేము. ఇక ప్రాణి మనుగడ ప్రశ్నార్థకమే.

"నీటిలో మరికొన్ని అద్భుత విశేషాలున్నాయి. వాటిని చూచినపుడు నా మదిలో సృష్టికర్త గొప్ప దయామయుడనిపిస్తుంది. తాను సృజించిన ప్రాణులకు తగిన వ్యవస్థ, (పోషణ, రక్షణ) చేశాడనిపిస్తుంది. చిత్ర విచిత్రమైన ఈ సృష్టిలో మనకు తెలిసిన పదార్థాలలో 'గడ్డకట్టిన పదార్థాలు తేలిక కావడం' అనే విశేషత ఒక్క నీటిలోనే కనబడుతుంది. ఈ కారణంతోనే నదులలోని, సరస్సులలోని నీరు చలికి గడ్డకట్టి ఆ గడ్డలు మునిగిపోకుండా నీటిపై తేలియాడుతాయి. చలి ఎక్కువయ్యే కొలది అవి మరింత గట్టిపడతాయి. క్రమంగా ఆ నీటిపై గడ్డకట్టిన మంచుపొర ఏర్పడుతుంది. ఆ మంచుపొర క్రమంగా ఆ నీటికి రక్షణ కవచంగా ఏర్పడి లోపల ఉన్న నీటి ఉష్ణోగ్రత తగ్గకుండా రక్షిస్తుంది. క్రింది నీరు చలికి గడ్డకట్టకుండా చేస్తుంది. అందుచే ఆ పొర అడుగున ఉన్న నీరు ద్రవరూపంలోనే ఉంటుంది. తద్వారా ఆ నీటిని ఆశ్రయించుకొని జీవిస్తున్న జలచరాలు కాపాడబడతాయి. మరల ఎండవచ్చి పైన గడ్డకట్టిన నీరు కరిగేవరకు ఆ మంచుపొర క్రింద అవి

సురక్షితంగా ఉంటాయి. అందుచేత నేను సృష్టికర్త అత్యంత మేధావి, అత్యంత శక్తి సామర్థ్యాలు కలవాడేకాక చాలా దయామయుడంటున్నాను. అతడు ప్రాణులను సృజించటమేకాక వాటికి కావలసిన అవసరాలను, ఆహారాన్ని, రక్షణను సమకూరుస్తున్నాడు. అట్టి దివ్యగుణయుక్త దేవుడు నాకు వేరే పదార్థాలలో కన్నా నీటిలోనే స్పష్టంగా కనబడుతున్నా" దంటూ డా. థామస్ డేవిడ్ గారు తమ వ్యాసాన్ని ముగించారు.

ఈ విధంగానే మిగిలిన 39 మంది విజ్ఞానవేత్తలు వారివారి శాస్త్ర విభాగ పరిధిలో ఆలోచించి సృష్టిని నిర్మించి కాపాడుతున్న దేవుడు ఉన్నట్లే నిరూపిస్తూ వ్యాసాలు వ్రాశారు. సృష్టిలో సర్వత్ర నియమబద్ధత, క్రమబద్ధత, సమతుల్యత, సమన్వయం, బుద్ధిమత్తత, దయామత్తత, ఒక ప్రయోజనం కనబడుతున్నాయన్నారు. మనం అర్థం చేసుకోవటంలో లోపాలున్నాయి కాని సృష్టిలో లోపాలు లేవన్నారు.

కనుక మన వేదశాస్త్రాలు ప్రతిపాదించే దైవతత్త్వం హేతుబద్ధము, వైజ్ఞానికము. అది ఆకారం ధరించదు. అవతరించదు. అట్టి తత్త్వాన్ని ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకొని ఉపాసించటమే ఉత్తమం. సృష్టిలోని గొప్ప గొప్ప పదార్థాలను, వింతలను, విచిత్రాలను దర్శిస్తూ వాటిని ఆ విధంగా నిర్మించిన సృష్టికర్త యొక్క అద్భుత శక్తి సామర్థ్యాలను గుర్తించి అతనిపై శ్రద్ధాభక్తులను పెంచుకోవటం ఉత్తమం. మీరేమంటారు?

ఇక మనం జీవుల గురించి ఆలోచిద్దాం.

జీవుడు (Soul)

జీవులంటే మనమే. సామాన్యంగా లోకంలో 'నేను, నేను' అని వ్యవహరించే మనం శరీరం కాదు. శరీరంలోనే ఉన్నా శరీరంకన్నా వేరుగా ఉన్నాము. కారులో కూర్చున్న వ్యక్తి కారుకన్న వేరుగా ఉన్నట్లు, ఇంట్లో ఉన్న వ్యక్తి ఇంటికన్న వేరుగా ఉన్నట్లు మనం ఈ శరీరంలో ఉన్నాము. జీవాత్మలమైన మనం ప్రస్తుతం మానవ శరీరంలో ఉన్నాము. కొందరము పురుష శరీరంలోను, కొందరము స్త్రీ శరీరంలోను ఉన్నాము. స్త్రీ పురుష భేదాలు శరీరానికేగాని జీవాత్మలమైన మనకుండవు.

అయినప్పటికీ మనం శరీరాన్నిబట్టే లోకంలో ప్రవర్తించవలసి ఉంటుంది. లేకుంటే చాలా చాలా యిబ్బందులొస్తాయి. ఈ జన్మలో మనం మానవ శరీరంలో ఉన్నాము. ఒకవేళ ఈ మానవజన్మలో పాపాలు చేస్తే అందుకు తగిన జంతువులుగానో, క్రిమికీటకాదులుగానో లేదా వృక్షాలుగానో పునర్జన్మలెత్తవలసి ఉంటుంది.

మానవ జన్మలో మనస్సు బాగా వికసించి ఉంటుంది. దానిలోని ఉన్నత భాగాన్ని బుద్ధి అంటాయి శాస్త్రాలు. దీనితో మనం ఎన్నెన్నో విషయాలు గ్రహించగలం, ఆలోచించగలం, ఇతరులకు బోధించగలం. దీనిని జ్ఞానగ్రహణ సాధనమనీ, అంతరింద్రియంగా ఉంటుందనీ ఋషులంటారు. బాహ్యేంద్రియాలతో తెలియబడని కొన్ని సూక్ష్మ విషయాలను ఈ బుద్ధితో తెలుసుకోగలుగుతాము. పరమాత్మవలెనే జీవాత్మ కూడా ఒక సూక్ష్మ విషయమే. శబ్ద స్పర్శ రూప రస గంధాలు దేవునిలో లేనట్లే జీవునిలోనూ లేవు. బాహ్యేంద్రియాలతో దేవుణ్ణి తెలుసుకోలేనట్లే జీవుణ్ణి కూడా తెలుసుకోలేము. కనుక, జీవులు ఎలా ఉంటారో తెలియాలంటే దేవుడు మనకిచ్చిన బుద్ధితో ఆలోచించక తప్పదు.

'జీవులు' ఎలా ఉంటారు? ఎలా గుర్తుపట్టాలి?

మన ప్రాచీన ఋషులు జీవుల గురించి చాలా లోతుగానే అధ్యయనం చేశారు. వాటిని దర్శన ఉపనిషదాది తత్త్వశాస్త్రాలలో పొందుపరిచారు. వీటిలోనేగాక, ఆయుర్వేద నీతిశాస్త్ర ఇతిహాసాది గ్రంథాలలో కూడా ఈ విషయాలు కనబడతాయి. కొన్నిచోట్ల అలంకారికంగాను, కొన్నిచోట్ల ఆంశికంగాను, కొన్నిచోట్ల సంక్షిప్తంగా సూత్రాలుగాను ఈ వివరణలున్నాయి. మనమంతా బుద్ధిజీవులం కనుక దర్శనశాస్త్ర మార్గాన్ని అనుసరించి ఆలోచన చేయటం మనకు అనుకూలంగా ఉంటుంది.

'నాది' అన్నప్పుడు ఆ వస్తువుకన్న మనం వేరు:

కపిల మహర్షి తమ సాంఖ్యదర్శన శాస్త్రంలో ఏమన్నారంటే – "ఓ మానవులారా! మీరు శరీరం కాదు. ఈ మాట మీ వ్యవహారంలోనే కనబడుతున్నది. జాగ్రత్తగా గమనించండి" అన్నారు. **"షష్ఠీ వ్యపదేశా దపి"** (సాంఖ్య దర్శనం. 6-3 – షష్ఠీ వ్యపదేశాత్ + అపి) – వ్యపదేశమంటే వ్యవహారమని అర్థం. లోక

వ్యవహారంలో మనం "నా కాలు, నా చెయ్యి, నా కన్ను నా ముక్కు" అంటూ ఉంటాము. జ్వరం వస్తే – "నా ఒంట్లో బాగాలేదు. చాలా జ్వరంగా ఉంది, నా ఒళ్ళు కాలిపోతోంది" అంటుంటాము. వ్యాకరణదృష్టితో ఈ వాక్యాలన్నీ షష్ఠీ విభక్తిలో ఉన్నాయి. వీటిని విడదీసి చెబితే "నా యొక్క కాలు, నా యొక్క చెయ్యి, నా యొక్క ఒళ్ళు (శరీరం)" అవుతాయి. ఈ షష్ఠీ విభక్తి ప్రయోగం సంబంధాన్ని తెలుపుతుంది. ఆ వస్తువుకు (లేదా ఆ వ్యక్తికి) మనకు ఉండే సంబంధాన్ని చెబుతాయి. అట్లే – 'నా మనస్సు బాగా లేదు, నా బుద్ధి పనిచేయలేదు' అంటూ ఉంటాము. కనుక ఇవి కూడా మనకు వేరుగా ఉన్నాయి. మన యోగేశ్వర శ్రీకృష్ణులవారు ఏమన్నారంటే –

ఇంద్రియాణి పరా ణ్యాహుః, ఇంద్రియేభ్యః పరం మనః ।
మనస స్తు పరా బుద్ధిః, యో బుద్ధేః పరత స్తు సః ॥

–భగవద్గీత 3–42

"శరీరంలో వేరే అవయవాలకన్న ఇంద్రియాలు శ్రేష్ఠంగా సూక్ష్మంగా ఉంటాయి. ఇంద్రియాలకన్న మనస్సు శ్రేష్ఠంగా సూక్ష్మంగా ఉంటుంది. మనస్సు కన్నను బుద్ధి శ్రేష్ఠంగా సూక్ష్మంగా ఉంటుంది. వీటన్నిటికన్నను జీవాత్మ శ్రేష్ఠంగా, సూక్ష్మంగా, వేరుగా ఉంటుం"దని వివరించారు. తదుపరి శ్లోకంలో "నేను, నేను అని వ్యవహరించే నీవు ఒక జీవాత్మవు. ఈ శరీర ఇంద్రియ మనోబుద్ధులన్నీ నీకన్న వేరుగా ఉన్నాయి. అవి నీకు సాధనాలుగా (పనిముట్లుగా, Instrumentsగా) ఉన్నాయి. కనుక వాటిని నీ అదుపులో పెట్టుకొని నీ ఉన్నతికై యత్నించు" (గీత. 3.43) అని ప్రబోధించారు.

ఉపనిషత్తులు జీవాత్మను రథంలో కూర్చున్న రాజుగా అభివర్ణిస్తాయి. శరీరాన్ని రథంగాను, బుద్ధిని సారథిగాను, మనస్సును కళ్ళెముగాను, నేత్రాది ఇంద్రియాలను అశ్వాలుగాను ఆలంకారికంగా వర్ణిస్తాయి. వీటిలో జీవాత్మ ఒక్కడే కర్తా భోక్తా అంటాయి. అతడే దేహేంద్రియ మనోబుద్ధులతో (సాధనాలతో) కర్మలు చేస్తూ వాటి ఫలితాలను అనుభవిస్తాడంటాయి. పరిమాణంలో వెంట్రుక మొనకన్నా చాలా చిన్న పరిమాణంగా (1/10,000గా) జీవుడుంటాడంటుంది శ్వేతాశ్వతరోపనిషత్తు (5–9).

శ్లో॥ బాలాగ్ర శత భాగస్య శతధా కల్పితస్యచ ।
భోగో జీవం స విజ్ఞేయః స చానంత్యాయ కల్పతే ॥

శ్వేతాశ్వతరోపనిషత్తు (5–9)

అర్థము: బాలాగ్రమంటే కేశాగ్రము (తలవెంట్రుక మొన). దానిని 10 భాగాలు చేసి, అందుండి ఒక భాగాన్ని తీసుకొని దానిని మరల 100 భాగాలు చేస్తే ఎంత సూక్ష్మాతి సూక్ష్మ పరిమాణముంటుందో అంత పరిమాణంలో జీవుడుంటాడు. అంటే, వెంట్రుక మొన 100 × 100 = 10,000 భాగాలు చేస్తే ఎంత పరిమాణం వస్తుందో అంత సూక్ష్మాతి సూక్ష్మంగా జీవుడుంటాడని శ్వేతాశ్వతర మహర్షి అన్నారు. కనుకనే నేను పరమాణువు కన్న చిన్న పరిమాణంగా జీవుడుంటాడన్నాను.

జీవుని పరిమాణం ఎంత చిన్నదంటే ఎలక్ట్రానిక్ మైక్రోస్కోపుతో కూడా చూడలేనంత చిన్నది. సూక్ష్మమైనది. ఇది ఒకప్పుడు కొత్తగా పుట్టలేదనీ, ఎన్నటికీ మరణించదనీ (లేకుండా పోదనీ) అంటాయి మన వేదశాస్త్రాలన్నీ. ఇక మనం జీవుణ్ణి ఎలా గుర్తించాలో ఆలోచిద్దాము.

జీవుణ్ణి ఎలా గుర్తుపట్టాలి?:

సామాన్యంగా ఏ పదార్థాన్నైనా వాటి గుణధర్మాలనుబట్టి గుర్తిస్తాము. సూక్ష్మ పదార్థాలైన మనస్సును, జీవాత్మ పరమాత్మలను కూడా అదేవిధంగా వాటి వాటి గుణాలను బట్టి గుర్తించవచ్చు నంటారు మన ప్రాచీన ఋషులు.

"ఇచ్ఛా ద్వేష ప్రయత్న సుఖ దుఃఖ జ్ఞానాని+ఆత్మనో లింగమ్" అంటారు గౌతమ మహర్షి తమ న్యాయదర్శనం (1–1–10) లో. అంటే – తనకొరకు ఇతరుల కొరకు ఏవేవో కోరికలను కలిగి ఉండటం, ఆ కోరికలకు అడ్డుపడేవారిని ద్వేషించటం, కష్టాలను, బాధలను దూరం చేసుకోవటం కోసం ప్రయత్నిస్తూ ఉండటం" అనేవి జీవుని ముఖ్యమైన గుణాలు. వీటితోబాటు సుఖదుఃఖాల అనుభవం పొందటం, ఎంతో కొంత జ్ఞానాన్ని కలిగి ఉండటం జీవుల లక్షణం – అంటే జీవుని ఉనికిని గుర్తించటానికి గుర్తులు Indications. ఈ ఇచ్ఛా ద్వేష ప్రయత్న సుఖ దుఃఖ జ్ఞానాలు జీవించివున్న మనిషిలోనే మనకు కనబడతాయి. విధివశాత్తు ఆ వ్యక్తి మరణిస్తే ఆ శవంలో మనకు ఈ గుణాలేవీ కనబడవు. ఈ

గుణాలు గల ఏదో ఒక అదృశ్య పదార్థం ఆ శరీరాన్ని విడిచి వెళ్ళిపోయిందని మన బుద్ధికి అర్థమౌతుంది. ఆ వెళ్ళిపోయిన అదృశ్య పదార్థాన్నే జీవుడంటారు గౌతమ మహర్షి.

కొన్ని వ్యాధి పరిస్థితులలో మనిషి కోమాలోనికి వెళ్ళిపోతాడు. అప్పుడు శరీరం జీవించియే ఉంటుంది కానీ పై గుణాలేవీ కనబడవు. అందుచే కణాద మహర్షి తమ 'వైశేషిక దర్శనం'లో మరికొన్ని గుణాలను జీవలక్షణాలలో చేరుస్తారు. వారేమన్నారంటే –

"ప్రాణాపాన నిమేషోన్మేష జీవన మనోగతీంద్రి యాంతర
వికారాః, సుఖదుఃఖేచ్ఛా ద్వేష ప్రయత్నా శ్చాత్మనో లింగాని"

–వైశేషిక దర్శనం 3–2–4

నాసికలో ప్రాణాపానముల గతి, కంటిరెప్పల నిమేష ఉన్మేషణాలు, జీవన మనోగతులు, ఇంద్రియాంతర వికారాలు, సుఖదుఃఖాల అనుభవం, ఇచ్ఛా ద్వేష ప్రయత్నాలు జీవుని ఉనికిని గుర్తించే లక్షణాలన్నారు. కనుక కోమాలోనికి వెళ్ళిన వ్యక్తిలో అన్ని గుణాలు లేకపోయినా జీవనగతులు కనబడతాయి. శ్వాస ఆడటం, గుండె కొట్టుకోవటం, రక్తప్రసార నాడీ ప్రసారాలు, మల మూత్రాది అవయవాలు పనిచేస్తూ ఉండటం మొదలగునవి కనబడుతూ ఉంటాయి. ఇవన్నీ జీవుడు ఉన్నప్పుడే జరుగుతాయి. ఇవి ఆగిపోతే జీవుడు ఆ శరీరాన్ని వదలి వెళ్ళిపోయినట్లు గుర్తించాలి.

సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే మానవులలో వలెనే జంతువులలో కూడా ఇచ్ఛాద్వేష ప్రయత్నాది గుణాలు కనబడతాయి. కనుక జంతువులన్నిటిలోనూ మనవంటి జీవులుంటారు. కాకపోతే వాటిలో జ్ఞానం అవి బ్రతకటానికవసరమైనంత మాత్రమే ఉంటుంది. అది జన్మతోనే సృష్టికర్త వాటికిస్తాడు. కొన్ని జంతువులు మనం శిక్షణ యిస్తే (ట్రైనింగ్ యిస్తే) కొన్ని పనులు నేర్చుకుంటాయి. వాటిలో బుద్ధి వికసించిలేనందున విశేష జ్ఞానాన్ని పొందలేవు.

వృక్షజాతులలోనూ జీవులుంటాయంటాయి మన శాస్త్రాలు. అవి కూడా ప్రాణవాయువును, జలాన్ని, సూర్యరశ్మిని గ్రహిస్తాయి. విశేషంగా ఇవి వీటితో భూసారాన్ని ఆహారంగా మార్చుకుని తమను పోషించుకోవటమేకాక మనను కూడా

పోషిస్తున్నాయి. బీజాలను ఉత్పన్నం చేసుకొని వంశాన్ని వృద్ధి చేసుకుంటున్నాయి. కనుక వీటిలోనూ జీవులుంటాయి. వీటిని స్థావర ప్రాణులంటాయి మన శాస్త్రాలు. **"... నమో వృక్షేభ్యో హరికేశేభ్యః పశూనాం పతయే నమోనమః"** అంటుంది యజుర్వేదం (16-17).

మనకు మూడు శరీరాలున్నాయి!!

జీవాత్మలమైన మనకు మూడు శరీరాలుంటాయని మన వేదశాస్త్రాలు చెబుతాయి. వీటికి స్థూల సూక్ష్మ కారణ శరీరాలని పేర్లు పెట్టాయి. వీటిలో మొదటిదైన స్థూలశరీరం మన కంటికి కనబడేదే. పైన చర్మంతో కప్పబడి ఉన్న ఈ స్థూల శరీరం లోపల కండరాలు, క్రొవ్వులు, రక్తనాళాలు, జ్ఞాననాడులు, చలన నాడులు, ఎముకలు మొదలగునవి ఉంటాయి. పుట్టినపుడు మూరెడు పొడుగు ఉండే ఈ శరీరం ఆహార పానీయాలతో 4 నుండి 6 అడుగుల ఎత్తువరకు ఎదుగుతుంది. అందచందాలు సంతరించుకుంటుంది. దీనికి వృద్ధిక్షయాలుంటాయి. కాలాంతరంలో – ఆయువు ముగిసిన తరువాత జీవుడు ఈ శరీరాన్ని వదిలి వెళ్ళిపోతాడు. దానితో శ్వాస నిలిచిపోతుంది. గుండె ఆగిపోతుంది. రక్తసంచారం ఆగిపోతుంది. కణాలకు ఆహారం, ఆక్సిజన్ అందక అవి మరణిస్తాయి. శరీరం క్రుళ్ళటం ప్రారంభమౌతుంది. వాసన భరించలేక మనం దానిని కాల్చటమో, పూడ్చటమో చేస్తాము. కనుక ఈ స్థూల శరీరం అందరికి ప్రత్యక్షమే.

ఈ స్థూల శరీరం పాంచభౌతికమైనది. అంటే – భూమి జలము అగ్ని వాయువు ఆకాశము అనబడే పంచభూతాలతో నిర్మితమయ్యింది. భూమినుండి వచ్చే ఆహారంతోను, నీటితోను నిర్మించబడినట్లు మనకు స్పష్టంగా తెలుస్తుంది. వీటికి తోడు వాయువు (ఆక్సిజన్) కూడా అవసరమే. ఈ మూడింటితో బాటు అగ్ని ఆకాశాలు మన శరీరంలో ఉంటాయి. మనకు తెలియకుండానే ఆహారం ద్వారా అగ్ని మన శరీరంలోకి చేరుతుంది. కట్టెలలో దాగి ఉన్న అగ్ని పొయ్యిలో అగ్నిగా వ్యక్తమైనట్లు ఆహారసారం (Lymph) శక్తి (Energy) గా మారేటప్పుడు అది వ్యక్తమౌతుంది.

ఈ నాలుగింటితోబాటు ఆకాశతత్త్వం కూడా శరీరంలో ఉంటుంది. ఆకాశతత్త్వం అంటే వట్టి ఖాళీ ప్రదేశం కాదు. గమనా గమనాలు, కదలికలు

కలగటానికి అవకాశమిచ్చే సర్వత్ర వ్యాపించి ఉండే తత్త్వం – పదార్థం. దానిలోనే శరీరంలోని క్రియలు, రక్త సంచారం, హృదయ స్పందన, జీర్ణ విసర్జనాది క్రియలు జరుగుతున్నాయి. కణాద మహర్షి వ్రాసిన వైశేషిక దర్శనం చదివితే ఆకాశం ఒక పదార్థమని మీకు అవగతమౌతుంది. ఈ శరీరం పంచభూతాలతో నిర్మితమై వాటితోనే పెరిగి పెద్దదయ్యింది. వాటిలోనే జీవిస్తున్నది. చివరికి మరల వాటిలోనే కలిసిపోతుంది. కనుక స్థూల శరీరాన్ని అందరూ అర్థం చేసుకోగలుగుతారు.

వేరే పశు పక్షి క్రిమికీటకాది శరీరాలలోకన్నా మానవ శరీరంలో ఇంద్రియాలన్నీ వికసించి ఉంటాయి. అవయవ నిర్మాణం అందంగా ఆకర్షణీయంగా ఉంటుంది. కాళ్ళూ చేతులు అనేక పనులు చేయటానికి, పరోపకారం చేసి పుణ్యాన్ని ఆర్జించటానికి అనువుగా ఉంటాయి. సాధనచేసి వివిధ కళలను నేర్చుకోవచ్చు. వాక్కుతోనూ వీటిని సాధించుకోవచ్చు. పుణ్యాన్ని ఆర్జించవచ్చు. కనుకనే ఋషులు మానవజన్మను ఉత్తమోత్తమ జన్మగా అభివర్ణించారు. అయితే, ఈ శరీరాన్ని నడిపించేది, చలనాన్నిచ్చేది సూక్ష్మ శరీరం. ఇక దానిని గురించి తెలుసుకుందాము.

స్థూల శరీరం మాదిరిగా సూక్ష్మశరీరం కంటికి కనబడదు. ఏ ఇంద్రియంతోను తెలియబడదు. కేవలం బుద్ధితో మాత్రమే దీనిని అర్థం చేసుకోగలం. సూక్ష్మ శరీరంలో పంచప్రాణాలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ సూక్ష్మభూతాలు, మనస్సు, బుద్ధి అన్నీ కలిసి 17 తత్త్వాలుంటాయని ఋషులంటారు. కొందరు పంచ ఉపప్రాణాలను, పంచ కర్మేంద్రియాలను కూడా కలపాలంటారు. వీటిని మూడు వర్గాలుగా చేసి అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాము.

1) ప్రాణమయకోశం: మనం పీల్చే గాలిలో నైట్రోజన్ వాయువే ఎక్కువగా 79% ఉంటుంది. కాని, అది మనకు ఉపయోగపడదు. అందుచే మన ఊపిరితిత్తులు దానిని స్వీకరించవు. తరువాతది ఆక్సిజన్. ఇది పీల్చేగాలిలో 20% ఉంటే, వదిలే గాలిలో 16% ఉంటుంది. కేవలం 4% ఆక్సిజన్ మాత్రమే శ్వాసకోశం తీసుకుంటుంది. ఆ కొద్ది ఆక్సిజన్ వాయువే మనను బ్రతికిస్తున్నది. అది ఒక్కటే, అది చేసే పనులనుబట్టి ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములని పేర్లు పెట్టారు. ఈ ప్రాణాలను గురించీ, వాటి స్థానాలను గురించీ, అవి చేసే క్రియలను గురించి భిన్న భిన్న అభిప్రాయాలున్నాయి. వాటిని చదివి వైజ్ఞానిక

దృష్టితో మననం చెయ్యగా నాకు ఈవిధంగా అర్థమయ్యాయి. మీరు కూడా ఆలోచించండి. ప్రాణవాయువు ఆహార పానీయాలను, గాలిని స్వీకరిస్తుంది. అపానం మలినాలను విసర్జిస్తుంది. మలమూత్రాలను, కార్బన్ డై ఆక్సైడును చెమటను శరీరం నుండి బయటకు పంపుతుంది.

వైద్య పరిభాషలో దీనిని బహిష్కరణ మండలము (Excretary System) అంటారు. వ్యానము నరకోశంలో (Nervous Systemలో) వ్యాపించి వాటి పనులను చేస్తుంది. ఉదానము మనం తీసుకున్న ఆహార పానీయాలను జీర్ణం చేసి రసంగా మారుస్తుంది. దీనిని జీర్ణమండలం (Digestive System) అని చెప్పవచ్చు. సమానం జీర్ణమైన ఆహారసారాన్ని శరీరంలోని ప్రతీ కణానికి అందిస్తుంది. దీనిని లింఫేటిక్ సిస్టమ్ (Lymphatic System or Circulatory System) అనవచ్చు.

మన శరీరంలోని గతికి కారణం వాయువంటుంది ఆయుర్వేదం. పైన వర్ణించిన వాయువులన్నీ సక్రమంగా పనిచేస్తేనే ఆరోగ్యం. వాటి గతులు వక్రిస్తే ఆయా అవయవాలు వ్యాధిగ్రస్తమౌతాయి. ప్రాణాయామాం చేయటంవల్ల ఆ వాయువులు సరిచేయబడటం, బలపడటం కూడా జరుగుతుంది. పూజ్యశ్రీ రాందేవ్‌బాబా గారు ఈ ప్రాణాయామ చికిత్సతోనే అనేక వ్యాధులను అద్భుతంగా నివారణ చేస్తున్నారు. ప్రపంచ వైద్యులను ఆశ్చర్యపరుస్తున్నారు. ఆలోచింప చేస్తున్నారు. కొందరు ఆధునిక వైజ్ఞానికులు ఈ ప్రాణమయకోశాన్ని కెర్లియన్ ఫోటోగ్రఫీ ద్వారా ఫోటోలు తీయగలిగారు. మరిన్ని పరిశోధనలు చేసి 'ప్రాణిక్ హీలింగ్' అనే ఒక చికిత్సా పద్ధతిని రూపొందించారు. కొన్ని గ్రంథాలు ప్రచురించారు. వారి ఒక పెద్ద పుస్తకం నేను కామారెడ్డిలో ఉన్నపుడు చదివాను. ఆ పద్ధతియు ఆలోచించవలసినదే.

2) మనోమయకోశం: సూక్ష్మ శరీరంలోని రెండవభాగం మనోమయ కోశం. దీనిని ఏ ఫోటోగ్రఫీతోనూ ఫోటో తీయలేము. ఇది చాలా సూక్ష్మమైనది. అయినా ఇది ఒక పదార్థమే. మన దర్శన శాస్త్రాలు మనస్సును ఒక పదార్థంగా నిరూపించి, దాని గుణకర్మలను వివరించి చెప్పాయి. వాటిని అక్కడ చదవండి.

సామాన్యంగా మనస్సు అనేది ఒకటుందని ప్రతీవ్యక్తికి తన అనుభవంలో

అవగతమౌతుంది. ముఖ్యంగా అది అశాంతికి గురియైనపుడు దాని ఉనికి స్పష్టంగా తెలుస్తుంది. దానిలోనే ఇంద్రియ శక్తులన్నీ ఉంటాయి. ఇదే జీవునకు ఇంద్రియజ్ఞానం కలిగిస్తుంది. మనస్సు పరధ్యానంగా ఉంటే చూసి కూడా కనబడదు. విని కూడా వినబడదు. ఇది మన శరీర నరకోశంలో అతివేగంగా తిరుగుతూ అన్ని ఇంద్రియాలతోను జీవుని కలుపుతుంది.. కనుకనే చూస్తూనే వినగలుగుతాం, తినగలుగుతాం, తిరగగలుగుతాం. సంక్షిప్తంగా దీనిని మనస్సు అని చెప్పవచ్చు. దీనిలోనే మనం చేసినవి, చేస్తున్నవి అయిన కర్మల సంస్కారాలు, సాధనలు, పాపపుణ్యాలు, స్మృతులు అన్నీ ఉంటాయని మన శాస్త్రాలు చెబుతాయి.

3) విజ్ఞానమయకోశం: దీనిని సంక్షిప్తంగా బుద్ధి అని చెప్పవచ్చు. బుద్ధి అంటే జ్ఞానాన్ని గ్రహించే సాధనం లేదా శక్తి. ఇంద్రియ మనస్సుల ద్వారా గ్రహించిన విషయాలను ఇది వివేచన చేస్తుంది. తన పూర్వ సంస్కారాలనుబట్టి తన కవసరమైన విషయాన్ని గ్రహిస్తుంది. రథంలో సారథి (డ్రైవరు) ఉన్నట్లు జీవాత్మలమైన మనకు ఇది సారథిగా ఉంటుందని ఉపనిషత్తులు చెబుతాయి. ఈవిధంగా ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశాలను (భాగాలను) కలిగి ఉంటుంది రెండవదైన సూక్ష్మ శరీరం.

మూడవది కారణ శరీరం: దీనిని మూల ప్రకృతి అని చెప్పవచ్చు. సత్త్వము, రజస్సు, తమస్సు అను పేర్లు గల అత్యంత ప్రాకృతిక సూక్ష్మ అణువులతో ఇది ఉంటుందట. దీనితోనే జీవుడు సుషుప్తిని (గాఢనిద్రను) పొంది ఆనందాన్ని అనుభవిస్తాడు. అలసిన మూడు శరీరాలు సేదతీరి శక్తిని, స్ఫూర్తిని పొందుతాయి. ఇది మూల ప్రకృతితో చేయబడుటచే జీవులందరికి సమానంగా ఉంటుంది. కనుకనే గాఢనిద్రలో పండిత పామరులంతా ఒకే రకమైన ఆనందాన్ని అనుభవిస్తారు.

యోగసాధనలో పరిపక్వత పొంది నిర్వికల్ప సమాధిని పొందిన యోగులకు మరొక నాల్గవ శరీరం ఏర్పడుతుందట. **దీనిని తురీయ శరీరమంటారు.** అట్టి తురీయ శరీరంతోనే సమాధ్యవస్థలో పరమేశ్వరుని ఆనందాన్ని అనుభవిస్తారు. “ఈ సమాధి సంస్కార జన్య శుద్ధ పరాక్రమము ముక్తియందును యథావిధిగా సహాయపడుతుం”దని మహర్షి దయానంద సరస్వతీ స్వాములవారు తమ సత్యార్థ ప్రకాశంలో నవమ సముల్లాసంలో వ్రాశారు. విశదంగా తెలిసికోగోరువారు అక్కడ

చూడండి. మనవంటి సామాన్య జీవులు స్థూల శరీరం పతనమైన తరువాత సూక్ష్మ కారణ శరీరాలను తమవెంట తీసుకునిపోయి మరొక స్థూల శరీరంలో ప్రవేశిస్తారు.

భగవద్గీతలో యోగేశ్వర శ్రీకృష్ణుడు జీవుని ఈ శరీరమార్పును ఒక ఉపమానం ద్వారా వివరించారు.

శ్లో॥ శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః,
గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధానివాశయాత్ ॥

-భగవద్గీత 15-8

వాయువు పుష్పాన్ని అక్కడనే వదిలి దాని గంధాన్ని (వాసనలను) దూరంగా తీసుకుపోతున్నట్లు జీవుడు మృత శరీరాన్ని అక్కడనే వదిలి తన సంస్కారాలనే వాసనలను తనవెంట తీసుకుపోతాడు.

సంక్షిప్తంగా ఇదీ మన మూడు శరీరాల కథ మరియు జీవుని కథ. ఇక మనం ప్రకృతిని గురించి ఆలోచిద్దాము.

"ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే ।
తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్యనశ్నన్నో అభి చాకశీతి ॥"

-ఋ. 1-164-20

ప్రకృతి (Nature)

విశ్వసృష్టిని గురించి ఆధునిక వైజ్ఞానికులలో విభిన్న అభిప్రాయాలున్నాయి. 10కి పైగా సిద్ధాంతాలున్నాయి. క్రీ.శ. 1927లో డా. యాబీ లిమ్రేత్ చేసిన పరిణామవాదంతో ఈ ఆలోచనా పరంపరలు ప్రారంభమయ్యాయి. సృష్టి ప్రారంభంలో విశ్వమంతా ఒక పెద్దముద్దగా ఉండేదనీ, అది కొన్ని పరిస్థితుల ప్రభావంతో ఒత్తిడికి గురియై ప్రేలిపోయిందనీ, ముక్కలు ముక్కలుగా విశ్వంలో వెదజల్లబడి సూర్య కుటుంబాలుగా ఏర్పడ్డాయనీ వారి వాదన. అనంతరం 1948లో హెర్మన్ బాండీ, థామస్ గోల్డు గార్లు విశ్వ యథాస్థితి వాదాన్ని తీసుకు వచ్చారు. వారు ప్రారంభంనుండి విశ్వం యిట్లే ఉండేదనీ, ఇకముందు కూడా యిట్లే

ఉంటుందనీ వారి వాదన. కొంతకాలం తరువాత డా. ఆర్.సి. టాల్మన్ గారు విశ్వస్పందన వాదాన్ని ప్రవేశపెట్టారు. వీరి సిద్ధాంతం ప్రకారం విశ్వ పదార్థమంతా 800 కోట్ల సంవత్సరాల కొక పర్యాయం సూర్య కుటుంబాలు, గెలాక్సీలు దగ్గరకు వచ్చేసి ఒక పెద్ద ముద్దగా అయిపోతుందనీ అది మరల ప్రేలిపోయి ముక్కలు ముక్కలుగా విసిరివేయబడి సూర్య కుటుంబాలుగా రూపుదిద్దుకుంటాయనీ వారి సిద్ధాంతం. (ఇది మన వేద సిద్ధాంతానికి కొంత దగ్గరగా ఉంది). అనంతరకాలంలో అనంతవిశ్వవాదమనీ, వికర్షణవాదమనీ, అనంత విశ్వాలనీ అనేక వాదాలొచ్చాయి. ఈ వాదాలలో 'ఏది సత్యం?' అని అడిగితే – విశ్వానికి మూల పదార్థం ఏదో తెలియటం లేదు, అది తెలిస్తే ఈ విషయమేకాక మరెన్నో సృష్టి రహస్యాలు చెప్పగలమంటున్నారు వైజ్ఞానికులు.

విశ్వసృష్టికి మూల పదార్థం ఏది?:

ఆధునిక వైజ్ఞానికులు చాలాకాలం ఈ సృష్టి వివిధ అణువులతో (మూలకాలతో) ఏర్పడిందన్నారు. అణుగర్భంలోకి వెళ్ళి చూచిన తదుపరి పరమాణువులు కారణమన్నారు. ప్రధానమైన 3 రకాల పరమాణువులను గుర్తించి సృష్టికి ప్రోటాన్ ఎలక్ట్రాన్ న్యూట్రాన్లు కారణమన్నారు. అనంతరం మరికొన్ని రకాల పార్టికల్స్‌ను కనిపెట్టి వీటన్నింటికి మరొక మూలకరణం ఏదో ఉండి ఉండాలంటున్నారు. అట్టి మూలకణాలను పట్టుకోవడానికి కోట్లాది డాలర్ల వ్యయంతో పెద్ద పెద్ద అబ్జర్వేటరీలు నిర్మించి నిర్విరామంగా రోదసిలోనికి దృష్టి సారిస్తున్నారు. కాని, ఇంతవరకు ఆ మూలకణాలేవో గుర్తించలేకపోయారు. కొందరు వాటికి న్యూట్రినోలనీ, కాస్మిక్ దస్టు అని పేరుపెట్టి పరిశోధనలు చేస్తున్నారు. రకరకాల ఊహాగానాలు చేస్తున్నారు. ఇక ఈ విషయంలో మన మహర్షులేమన్నారో తెలుసుకుందాము.

కణాద మహర్షి స్థూల దృష్టితో ప్రపంచాన్ని పరిశీలించగా వారికి సృష్టిలో 9 రకాల ద్రవ్యాలు (పదార్థాలు) కనబడ్డాయి. మహర్షి వాటిని తమ వైశేషిక దర్శనంలో ఈ విధంగా సూత్రీకరించారు.

> **"పృథి వ్యాపస్తేజో వాయు రాకాశం, కాలో దిగాత్మా మన ఇతి ద్రవ్యాణి"**
>
> –వైశేషిక దర్శనం 1-1-5

అంటే – ఈ సృష్టిలో భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, కాలము, దిక్కు, ఆత్మ, మనస్సు అనబడే 9 రకాల ద్రవ్యాలు (పదార్థాలు) ఉన్నాయన్నారు. వీటిలో ఆత్మ ఒక్కటే జ్ఞానం కలిగినదనీ, అది ఆది అంతములు లేని నిత్యపదార్థమనీ వారి దర్శన శాస్త్రంలో అన్నారు. ఇంతేగాక వారు ప్రపంచంలోని సుమారు 25 గుణాలను లెక్కించి ఏ పదార్థంలో ఏ ఏ గుణాలున్నాయో వివరించి చెప్పారు. తర్కబద్ధంగానూ నిరూపించారు. ఆ వివరాలు 'వైశేషిక దర్శనం'లో చదవండి. మనం ప్రస్తుతం జడ పదార్థాలైన ఎనిమిదింటికి మూలమైన మూల పదార్థాన్ని – ప్రకృతిని గురించి తెలుసుకుందాము.

మూల ప్రకృతిని గురించి లోతుగా అధ్యయనం చేసినవారిలో కపిల మహర్షి అగ్రగణ్యులు. వారు వారి అధ్యయన సారాంశాన్ని తమ సాంఖ్యదర్శన శాస్త్రంలో ఈవిధంగా సూత్రీకరించారు.

"సత్వ రజస్తమసాం సామ్యావస్థా ప్రకృతిః ;
ప్రకృతేర్ మహాన్, మహతో అహంకారః ;
అహంకారాత్ పంచ తన్మాత్రాణి ఉభయమింద్రియం ;
తన్మాత్రేభ్యః స్థూలభూతాని ;
పురుషః ఇతి పంచవింశతిర్గణః"

–సాంఖ్య దర్శనం 1–61

ఇది చాలా గంభీరమైన విషయం కనుక జాగ్రత్తగా అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాము.

సత్వరజస్తమసాం సామ్యావస్థా ప్రకృతిః

అంటే – సత్వము, రజస్సు, తమస్సు అనబడే మూడు రకాల అత్యంత సూక్ష్మకణాలు సామ్యావస్థలో ఉండే స్థితిని ప్రకృతి అంటారు. అవే సృష్టిలోని జడపదార్థాలన్నింటికి మూలకణాలు. వాటినుండే క్రమపరిణామం చెందుతూ నేడు వైజ్ఞానికులు చెప్పే పరమాణువులుగా ప్రోటాన్, ఎలక్ట్రాన్, న్యూట్రాన్‌లుగా అయ్యాయి. ఆ స్థూల పరమాణువులు వివిధ నిష్పత్తులలో మేళవింపబడి మూలకాలు (Elements) గానూ, వివిధ సమ్మేళనాలు (Compounds) గానూ రూపుదిద్దుకొని వివిధ పదార్థాలుగా తయారై మన కంటికి కనబడుతున్నాయి. లేకుంటే మూల

ప్రకృతిని మనం చూడలేము. అత్యంత శక్తిగల సూక్ష్మదర్శినికి కూడా అవి కనబడవు. ఎందుచేతనంటే మన అనుభవంలో ఉన్న 'మనస్సు, బుద్ధి' కూడా మూల ప్రకృతి నుండి తయారైనవే. వాటిని మనం చూడలేము కదా! కపిల మహర్షి తదుపరి వాక్యాలలో ఈ విషయమే తెలుపుతున్నాడు.

ప్రకృతేర్ మహాన్: అట్టి అత్యంత సూక్ష్మ ప్రకృతినుండి ముందుగా మహాన్ (మహతత్త్వం) అనబడే పదార్థం పుడుతుంది. దానితోనే సృష్టికర్త మానవులలో కనబడే బుద్ధిని తయారు చేశాడు. మనకు కొద్ది కొద్దిగా యిచ్చాడు. మనం గట్టి ప్రయత్నం చేస్తే అది చాలా వికసిస్తుంది.

మహతో అహంకారః: ఆ మహతత్త్వాన్ని కొద్దిగా స్థూలం చేసి 'అహంకారం' అనే పదార్థాన్ని తయారుచేశాడు. ఇచట అహంకారం అంటే మానవులలోని "నేనే గొప్ప అనేకునే అహంభావం" కాదు. ఇది సూక్ష్మ పరమాణువులతో ఏర్పడిన ఒక జడ పదార్థం.

అహంకారాత్ – పంచ తన్మాత్రాణి, ఉభయ మింద్రియం:

అహంకారం నుండి పంచ తన్మాత్రలనే అయిదు రకాల సూక్ష్మ పదార్థాలు నిర్మింపబడ్డాయి. వీటిని శబ్ద స్పర్శ రూప రస గంధ తన్మాత్రలంటారు. ఆ అహంకారంతోనే మన శరీరాలలోని పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు మరియు వీటిని సంయుక్తం చేస్తూ జీవునితో కలిపే మనస్సు నిర్మించబడతాయి. అహంకారంతో పుట్టినవి మొత్తం 16 (5+5+5+1).

ఇక్కడ ఇంద్రియాలంటే మనకు కనబడే కన్ను, చెవి, ముక్కు, నాలుక మొదలైనవి కావు. వాటిలో అదృశ్యంగా ఉండే చూచే శక్తి, వినేశక్తి మొదలైనవని గ్రహించాలి.

తన్మాత్రేభ్యః స్థూల భూతాని: అహంకారంలోని ఒక భాగంగా పుట్టిన తన్మాత్రల నుండి మనకు కనబడుతున్న స్థూలభూతాలు – పృథివ్యాపస్తేజో వాయు రాకాశాలు పుట్టాయి. అందుచేతనే పంచభూతాలలో పంచగుణాలు ప్రధానంగా కనబడుతున్నాయి. వాటిని గ్రహించగల పంచ జ్ఞానేంద్రియాలను సృష్టికర్త మనకు అహంకారం అనే పదార్థంతోనే నిర్మించియిచ్చాడు. ఈ పరిణామాలన్నీ కలిపితే 24 అవుతాయి.

ఇవన్నీ మూల ప్రకృతి నుండి క్రమంగా ఏర్పడిన జడ పదార్థాలే కాని, ప్రాణులలో సుఖదుఃఖాలను అనుభవించే జ్ఞానం కనబడుతున్నది కదా! ఈ జ్ఞానం ప్రకృతి పదార్థాల కలయికవల్ల క్రొత్తగా పుట్టింది కాదు. జడం నుండి జ్ఞానం పుట్టడం అసంభవం. కనుక ప్రకృతికన్న వేరుగా జ్ఞానం కలిగిన పదార్థం మరొకటి ఉందని అంగీకరించవలసి వస్తుంది. దానినే కపిల మహర్షి – పురుషుడు అంటారు. **"+పురుషః ఇతి పంచవింశతిర్గణః"** అన్నారు. అంటే "సృష్టిలో జడప్రకృతితోబాటు జ్ఞానం కల పురుషుడు (జీవుడు) అనబడే జీవతత్త్వం కూడా ఒకటి ఉంది" అన్నారు. ఆ జీవతత్త్వం ప్రకృతికన్న పూర్తిగా భిన్నమైనదని తమ సాంఖ్యదర్శనంలో తర్కించి నిరూపించారు. ఈ రెండేగాక, పరమాత్మతత్త్వం మరొకటి ఉన్నదని నిరూపించారు. పై 24తో ఈ పురుష తత్త్వాన్ని కూడా కలిపి మొత్తం (పంచవింశతి+గణః) 25 అని లెక్కించారు.

మన వేదశాస్త్రాలన్నిటిలోను విశ్వసృష్టికి మూలం ప్రకృతి అనియే చెప్పబడింది. అది జడము – జ్ఞానం లేనిది. కనుక తనంతతానుగా విశ్వం కాలేదు. అట్టి ప్రకృతిని –

"ఏకో వశీ సర్వభూతాంత రాత్మా, ఏకం రూపం
బహుధా యః కరోతి"

–కఠోపనిషత్తు 5–12

సర్వ భూతాలకు అంతరాత్మయు, ఒకే ఒక్కడు, సర్వాన్ని వశంలో ఉంచుకొన్నవాడునైన ఏ పరమాత్మ ఉన్నాడో అతడే ప్రలయకాలంలో ఏకరూపంగా ఉన్న ప్రకృతిని అనేకవిధ రూపములుగా సృష్టిగా చేయుచున్నాడంటాయి మన ఉపనిషత్తులు.

ఆ ప్రకృతి మూడు రకాల పరమాణువుల మిశ్రమ పదార్థం. సృష్టికర్త వీటిని హెచ్చు తగ్గులుగా కలిపి పరమాణుబంధం వేసి వివిధ మూలకాలు (Elements) గా నిర్మించాడు. ఆ మూలకాల సమ్మేళనమే ఈ విశ్వం. ఇక మనం సృష్టికర్త వేదాలలో సంక్షిప్తంగా చెప్పిన సృష్టి క్రమాన్ని గురించి తెలుసుకుందాము.

ఋగ్వేద దశమ మండలంలోని 190వ సూక్తం అఘమర్షణ సూక్తమనే పేరుతో ఆధ్యాత్మిక క్షేత్రంలో ప్రసిద్ధి పొందింది. సస్వర వేదపాఠం చేసేవారంతా

– "అత మఘ ఘర్షణ సూక్తమ్" అంటూ ఈ సూక్తాన్ని పఠిస్తారు. కేవలం మూడు (3) మంత్రాలు గల ఈ చిన్న సూక్తం సృష్టి రచనను సంక్షిప్తంగా చెబుతుంది. ఈ మంత్రాలకు అఘమర్షణో మధుచంధసుడు ఋషి. అంటే – ఆ పేరు గల ఆది ఋషి ఈ మంత్రాల అర్థాన్ని మనన చింతనలు చేస్తూ యోగసాధన చేసి సమాధిస్థితిలోనికి వెళ్ళాడు. అంతర్యామి సాక్షాత్కారం పొంది ఆయన ద్వారా ఈ మంత్రాల అసలు అర్థాన్ని తెలుసుకున్నాడు. తను తెలుసుకున్న ఆ అర్థాలను శిష్యులకు, తోటి మానవులకు వివరించి చెప్పాడు. ఈ మంత్రాలలో విశ్వ సృష్టి రచన సంక్షిప్తంగా ఉందనీ, వీటిని అర్థ భావనతో పఠిస్తే విశ్వాత్మ సర్వవ్యాపకుడు, సర్వశక్తిమంతుడునని గ్రహించి పాపాలు చేయకుండా ఉంటారనీ బోధించాడు.

సంస్కృతంలో 'అఘ' మంటే పాపమని అర్థం. 'మర్షణ' మంటే పోగొట్టుకోవటం అని అర్థం. 'అఘమర్షణం' అంటే పాపాలు పోగొట్టుకోవటం. అయితే ఇక్కడ ఈ మూడు మంత్రాలు పఠిస్తే చేసిన పాపాలు పోతాయని కాదు. పాపం చెయ్యకుండా ఉంటామనీ, పాపభీతితో జీవనయాత్ర సాగిస్తామనీ అర్థం. ఈ వేదఋషి అసలు పేరు మధుఛందసుదు. ఆయన ఈ పాపనిరోధక మంత్రార్థద్రష్ట కనుక అతనిని గుర్తిస్తూ ప్రజలు 'అఘమర్షణో మధుచ్ఛందసః" అని పిలుచుకున్నారు.

ఈ మంత్రాల దేవత 'భావవృత్తమ్'. వేద ప్రకరణంలో 'దేవత అంటే – ఆ సూక్తం లేదా ఆ మంత్రం చెప్పే విషయం. "Subject of the Suktam or Mantra" అని అర్థం. 'భావవృత్తమ్' అంటే భావించబడిన – ఊహించబడిన వృత్తం (వలయం). మబ్బులు లేని ఒక రాత్రి మనం ఆకాశాన్ని పరికించి చూచినట్లయితే అనేకానేక నక్షత్రాలు అన్నివైపులా కనబడతాయి. అవన్నీ భూమిచుట్టూ ఒక వలయంగా – వృత్తంగా ఉన్నట్లు అనిపిస్తుంది. అట్టి నక్షత్ర వలయాన్నే మన ఋషులు భావవృత్తమనీ, కాంతివృత్తమనీ, ఖగోళ వృత్తమనీ పేర్కొన్నారు. ఇక్కడ ఈ మంత్రాలలో ఆ భావవృత్తం (అనేకానేక నక్షత్ర కుటుంబాల) సృష్టి ఎలా జరిగిందో చెప్పబడింది. ఇక ఆ మంత్రాల గురించి ఆలోచిద్దాము.

అథ అఘమర్షణ సూక్తమ్

ఓ3మ్ ఋతం చ సత్యం చ + అభీద్ధా తపసో౽ ధ్యజాయత ।

తతో రాత్ర్యజాయత, తతః సముద్రో అర్ణవః ॥ (1)

ఓ3మ్ సముద్రా దర్ణవాదధి సంవత్సరో అజాయత ।
అహోరాత్రాణి విదధద్ + విశ్వస్య మిషతోవశీ ॥ (2)

ఓ3మ్ సూర్యా చంద్రమసౌ ధాతా యథాపూర్వం మకల్పయత్ ।
దివం చ పృథివీం చ + అంతరిక్షమథో స్వః ॥ (3)

-ఋగ్వేదం 10-190-1 నుండి 3

వాక్యార్థం:

ఓ3మ్: ఇది మంత్రంలోని భాగం కాదు. ఏదైనా మంత్రాన్ని పఠించేటప్పుడు ఆ జ్ఞానాన్ని యిచ్చిన సృష్టికర్తను స్మరించటం వేద సాంప్రదాయం. సృష్టికర్త యొక్క గుణగణాలు, శక్తి సామర్థ్యాలు అనంతం. అందుచే గుణానికి ఒక పేరుగా అనేక నామాలు ఏర్పడ్డాయి. వాటిలో 'ఓ3మ్' అనేదే అతని ముఖ్యనామం - అసలు పేరు. అందుచే ఆ నామంతోనే స్మరిస్తారు.

1. ఋతం చ సత్యం చ అభీద్ధాత్ + తపసః + అధ్యజాయత = ఋత సత్యములు పరమాత్మ యొక్క ప్రకాశవంతమైన తపస్సుతో సృష్టిగా ఉత్పన్నమయినవి. ఋతం అంటే ప్రాకృతిక నియమాలు. సత్యం అంటే సత్వరజస్తమో గుణాత్మకమైన మూల ప్రకృతి (అవ్యక్తము). దీని భావమేమంటే - తనలో ఉన్న ప్రకృతిని సృష్టికర్త తన గొప్పదైన తపస్సుతో కొన్ని శాశ్వత నియమాలు గల విశ్వంగా నిర్మించాడని అర్థం.

తతః+రాత్రీ+అజాయత= ఆ పరిణామక్రమంలో ముందుగా ప్రళయరూప రాత్రి ఉత్పన్నమయ్యింది.

తతః+సముద్రః+అర్ణవః= దానినుండి అర్ణవ సముద్రం (పరమాణు సముద్రం) ఉత్పన్నమయ్యింది.

2. సముద్రాత్+అర్ణవాత్+అధి+సంవత్సరః+అజాతయ= ఆ అర్ణవ సముద్రం క్రమంగా ఒక చోటికి చేరి 'అధి సంవత్సర' నామక మహదండంగా ఉత్పన్నమయ్యింది. అంటే ఒక పెద్ద ముద్దగా (అండంగా) ఏర్పడింది. అది క్రమంగా కేంద్రం వైపుకు నొక్కివేయబడుటచే ఆ వత్తిడికి ప్రేలిపోయింది. ముక్కలు ముక్కలుగా విడిపోయి విసిరివేయబడ్డాయి. దీనినే ఆధునిక వైజ్ఞానికులు "బిగ్‌బ్యాంగ్" జరిగిందంటున్నారు.

అహోరాత్రాణి విదధద్ + విశ్వస్యమిషతః + వశీ= బిగ్‌బ్యాంగ్ జరిగిన తరువాత విసిరివేయబడిన ఆ ముక్కలు నక్షత్రాలుగా ఏర్పడ్డాయి. అవి మరల కేంద్రిక వత్తిడికి గురియై ప్రేలిపోయి గ్రహ ఉపగ్రహాలై నక్షత్రాల చుట్టూ తిరుగుతున్నాయి. ఇవన్నీ తమలో తాము తిరుగుతూ, వాటి వాటి కేంద్రం చుట్టూ తిరుగుతున్నాయి. వాటిలో నక్షత్రాలను సూర్యులనీ, వాటిచుట్టూ తిరుగువానిని గ్రహాలనీ, గ్రహాల చుట్టూ తిరుగువానిని ఉపగ్రహాలనీ (చంద్రులనీ) వ్యవహరిస్తున్నాము. మనభూమికి ఒకే ఉపగ్రహం ఉంది. కాని కొన్ని గ్రహాలకు 2, 3, 4 ఉపగ్రహాలున్నాయి. అవి ఆ గ్రహాలకు చంద్రులన్నమాట. ఈ సూర్య కుటుంబాలలో సూర్యుడొక్కడే స్వయం ప్రకాశకుడు. తనలో ఉన్న హైడ్రోజన్ వాయువు హీలియం వాయువుగా మార్పు చెందుచున్నందువల్ల పెద్ద పెద్ద అగ్నిజ్వాలలు వెలువడి సూర్యులను ప్రకాశవంతం చేస్తున్నాయి. కనుక అవి స్వయం ప్రకాశకాలయ్యాయి. అట్టి ప్రక్రియ గ్రహాలలో జరగనందున అవి సూర్య ప్రకాశంతో ప్రకాశితములౌతున్నాయి.

గ్రహాలు తమచుట్టూ తాము తిరుగుచుండటంవల్ల గ్రహాలపై సగభాగం సూర్యకాంతి పడి పగలుగాను, వెనుకవైపు రాత్రిగాను ఉంటున్నాయి. ఈ ఏర్పాట్లన్నీ వాటంతట ఈవి ఏర్పడినవి కావు. 'వశీ' నామక విశ్వాత్మయే వాటిని అట్టి నియమాలతో బంధించి తన వశంలో పెట్టుకున్నాడని ఈ మంత్రం స్పష్టంగా చెబుతున్నది. ఈ ఒక్క మంత్రమే కాదు, సృష్టికి కర్త పాలకుడు ఒకడున్నాడని వేలకొలది మంత్రాలు చెబుతున్నాయి. ఇవన్నీ సహజంగా జరుగుచున్నట్లు కనబడుతున్నా వాటిని ఆ విధంగా ఏర్పాటు చేసిన జ్ఞానం గల తత్త్వం ఒకటి ఉండాలి. ఆటోమేటిక్ వాచీ తనంత తాను పనిచేస్తున్నా - తిరుగుతున్నా దానిని నిర్మించిన వైజ్ఞానికుడు ఒకడుండాలి కదా! కంప్యూటర్లు, రోబోలు వాటంతట అవి పనిచేస్తున్నా వాటిని కొందరు వైజ్ఞానికులు కలిసి నిర్మించారు కదా! కొన్ని ఇనుపముక్కలు వాటంతట అవి కలిసి ఆయా యంత్రాలుగా కాలేదు కదా! అట్లే, సృష్టిని కొన్ని నియమాలతో బంధించి నిర్మించిన సర్వోన్నత విజ్ఞానవేత్తనే ఈ మంత్రం 'వశీ' నామంతో పేర్కొంటున్నది.

3. సూర్యచంద్రమసౌ ధాతా యథాపూర్వం అకల్పయత్ = పూర్వ కల్పంలో సూర్య చంద్రులను సృష్టించినట్లే ఈ కల్పంలోను - సృష్టిలోనూ సృష్టించినాడు. ఇంతేకాక, వాటిని ధరిస్తున్నాడు. ఆయా స్థానాలలో భ్రమణం చేయిస్తున్నాడు.

దివం చ పృథివీం చ + అంతరిక్షమ్ + అథో స్వః = సూర్య చంద్రులను సృష్టించినట్లే ద్యులోక పృథివీ లోకాలను, వాటిమధ్య ఉండే అంతరిక్షాన్ని, అంతరిక్షంలో ఉండే ఉపగ్రహాలను సృజించి ధరించి నియమించి నడిపిస్తున్నాడు.

విశ్వసృష్టిని గురించి నేటి వైజ్ఞానికులు భిన్న భిన్న అభిప్రాయాలను (Theories – వాదాలను) కలిగియున్నారు. డా. యాబీ లిమ్రేత్ పరిణామవాదాన్నీ, హెర్మన్ బాండీ, థామస్ గోల్డ్ కలిసి యథాస్థితి వాదాన్ని, R.C. టాల్మన్ పల్సేషన్ వాదాన్నీ (Pulsation Theory ని), జార్జ్‌గామో అనంత విశ్వవాదాన్నీ మరికొంతమంది మరికొన్ని వాదాలను ప్రతిపాదించారు. వీటిలో టాల్మన్ చెప్పిన విశ్వస్పందన వాదం ఈ అఘమర్షణ సూక్తానికి చాలావరకు సరిపోతుంది. ఆయన ఏమన్నారంటే –

విశ్వ పదార్థమంతా 800 కోట్ల సంవత్సరాల కొకసారి దగ్గరగా వచ్చి ఒక పెద్దముద్దగా ఏర్పడుతుందనీ, అది కేంద్రిక వత్తిడికి గురియై ప్రేలిపోయి సూర్య కుటుంబాలుగా ఏర్పడతాయనీ అన్నారు. మన వేదశాస్త్రాలు 432 కోట్ల సంవత్సరాల కొకసారి సృష్టి అంతా క్రమంగా పరమాణువులుగా విడిపోతుందనీ, అట్లే అది మరొక 432 కోట్ల సంవత్సరాలు ఉంటుందనీ దానినే ప్రళయమంటారని చెబుతాయి.

ఇదీ సంక్షిప్తంగా అఘమర్షణ సూక్తం చెప్పే సృష్టిరచన. దీనిని అర్థభావనతో పఠించుటవలన సృష్టికర్త యొక్క శక్తి సామర్థ్యాలు మనకు అవగతమౌతాయి. అతనిపై శ్రద్ధాభక్తులు ఇనుమడిస్తాయి. అతడు సర్వవ్యాపకుడై అన్నిటిని ధరిస్తూ, సర్వసాక్షియై మనంచేసే మనోవాక్కాయ కర్మలను చూస్తున్నాడు కనుక మనం పాపకార్యాలు చేయటానికి భయపడతాం. అతడు విధాత – కర్మఫలదాత కూడా కనుక పాపకార్యాలు చేయకుండా ఉంటాము. న్యాయాధీశుని ఎదుట చెడుకార్యాలు చేయలేము కదా! అందుకని ఈ మంత్రాలకు అఘమర్షణ మంత్రాలనే పేరు వచ్చింది.

మహర్షి దయానందుల వారు తాము సంకలనం చేసిన సంధ్యావందన విధిలో వీటిని చేర్చి, వాటికి సరియైన అర్థం వ్రాసి మనకు మహోపకారం చేశారు. వాటి తెలుగు అనువాదాలు ప్రచురించబడ్డాయి. ఆ సంధ్యావందన విధి

వైజ్ఞానికంగాను, హేతుబద్ధంగాను కూడా ఉంది. దాని పూర్తి విధి యొక్క వైజ్ఞానిక సమాలోచన నా రచన "సంధ్యా వందనము – వైజ్ఞానిక సమాలోచనము'లో చూడగోరుచున్నాను.

ప్రియ పాఠకులారా! హేతుబద్ధంగాను, వైజ్ఞానికంగాను ఆలోచిస్తే సృష్టిలో ఈ మూడు పదార్థాలూ – దేవుడు, జీవుడు, ప్రకృతి ఉన్నాయి. ఈ మూడు అనాది పదార్థాలు. వీటికి ఆది అంతములుండవు. ఎప్పటికీ ఉంటాయి. అయితే వీటి పరిమాణాలు, గుణాలు, శక్తి సామర్థ్యాలు వేరువేరుగా ఉంటాయి. దేవుడు మిగిలిన రెండిటికన్నా పరిమాణంలోను, జ్ఞానంలోను, శక్తి సామర్థ్యాలలోను చాలా చాలా పెద్దవాడు, గొప్పవాడు. అతనిలోనే కోటానుకోట్ల జీవులు, ప్రకృతి పరమాణువులు ఒక మూల పడి ఉన్నాయి. అవి ఒకదానికంటె మరియొకటి సూక్ష్మమైనవి. వీటిని గురించి సృష్టికర్త ఏమన్నాడో అతని మాటలలోనే తెలుసుకుందాము రండి.

వేదం త్రైతవాదాన్ని ప్రతిపాదిస్తుంది

లోకంలో వాదాలు చాలా ఉన్నాయి. వాదాలంటే సంప్రదాయాలు. విదేశీ మతాలలో 2, 3 సంప్రదాయాలే ఉన్నాయి కాని మన వేదమతంలో (హిందూ మతంలో) అనేక సంప్రదాయాలున్నాయి. ఎవరికి వారు మాది వేదప్రతిపాదితమే అంటారు. కొన్ని ఉపనిషత్తు వాక్యాలు చూపించి వాటికి వక్రంగా – తమకు అనుకూలంగా అర్థాలు చెప్పి వేరు వేరు సంప్రదాయాలు నెలకొల్పారు. కొందరు నవీన పురాణాలను పట్టుకొని మతాలను స్థాపించారు. ముందు శైవ సంప్రదాయం ప్రారంభమయ్యిందట. అనంతరం గాణాపత్యం, తాంత్రికం, చార్వాకం, అద్వైతం, ద్వైతం, విశిష్టాద్వైతం, ద్వైతాద్వైతం, మహాద్వైతం మొదలైన అనేక రకాల అద్వైతాలు పుట్టాయి. పూర్వం అడ్డబొట్టుకు, నిలువుబొట్టుకు వాదాలేకాక యుద్ధాలు కూడా జరిగాయట. ఈ మధ్య బ్రహ్మకుమారీలు, బాబాలు, అమ్మలు, స్వాములు చాలా వర్గాలనే తయారు చేస్తున్నారు. 'గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః' అని ఉపదేశిస్తూ గురువులే దేవుళ్ళవుతున్నారు. లేదా దేవుని అవతారాలౌతున్నారు. ఇంతకీ దేవుళ్ళెంతమంది ఉంటారు? సంప్రదాయానికి ఒక దేవుడు, వర్గానికి ఒక దేవుడు, మతానికొక దేవుడు ఉంటే పరస్పర రాగద్వేషాలు, ఆధిపత్య పోరాటాలు తప్పవు కదా!

పైన ప్రతిపాదించిన మతాలేవీ వేదమతాలు కావు. కొంత కొంత వ్యత్యాసంగానే ఉన్నాయి. అవన్నీ వారి కపోల కల్పితాలు, ఊహాగానాలు.

ఉదాహరణకు: ఆది శంకరాచార్యులవారు దశోపనిషత్తులను, భగవద్గీతను, బ్రహ్మసూత్రాలను ప్రామాణికంగా తీసుకొని వారి అద్వైత వాదాన్ని ప్రతిపాదించారు. ఈ మూడిటికి ప్రస్థాన త్రయమని పేరు పెట్టారు. వీటిలో ఒక్క ఈశోపనిషత్తు తప్ప మిగిలిన గ్రంథాలన్నీ వేదాలలో భాగం కాదు. వేదాలకు శ్రుతులు అని పేరు. అంటే – సృష్టికర్త ఋషుల హృదయాలలో వినిపించినవి. ఆ నలుగురు ఆది ఋషులు. వారు విన్నది తమ బుద్ధులలో చక్కగా ధారణ చేసి వాటిని విన్నది విన్నట్టుగా శిష్యులకు నేర్పారు. ఆ విధంగా చాలాకాలం వరకు గురుశిష్య పరంపరగా వేదాలు వింటూ వచ్చినవే కనుక వాటికి శ్రుతులనే పేరు స్థిరపడింది. ఇప్పటికిని వేదపాఠీయులు శిష్యులచే స్వరసహితంగా కంఠస్థం అయ్యేవరకు వినిపిస్తూనే ఉంటారు.

సృష్టికర్త సృష్ట్యాదిలో వేదఋషుల హృదయాలలో ప్రకటించబడిన వేదం ఏమంటుందంటే –

ఓం బాలాదేకమ్ + అణీయస్కం, ఉతైకం నైవ దృశ్యతే ।
తతః పరిష్వ జీయసీ దేవతా సా మమ ప్రియా ॥

–అథర్వవేదం 10–8–25

తాత్పర్యం: ఓ మానవులారా! ఈ సృష్టిలో వెంట్రుక మొనకన్నను సూక్ష్మమైన తత్త్వం ఒకటున్నది. (అది పరమాణువులు). అంతకన్నను సూక్ష్మతర తత్త్వం మరొకటున్నది. అది ఏ సూక్ష్మ దర్శినికీ కనబడనిది (అది జీవుడు). ఈ రెంటికన్నను సూక్ష్మతమ తత్త్వం వేరొకటున్నది. అది అన్నిటిని అన్నివైపులనుండి ఆలింగనం చేసుకొని అన్నిటిలోను ప్రవేశించియున్నది. (అది దేవుడు). ఆ సూక్ష్మతమ దేవతయే నాకు అత్యంత ప్రియమైనది.

The one (i.e., Atom) are even subtler than hair (the infinitesimal of hair); and one (i.e. souls) are invisible. But the subtlest and most pervading divinityis the only object of my love and devotion.

వైజ్ఞానిక వివరణ: మనం ఈ సృష్టిలోని పదార్థాలను విశ్లేషణ చేస్తే ఇదంతా అణువుల సంఘాతం – వివిధ మూలకాల (Elements) సమ్మేళనం. అన్ని అణువులలోను ప్రోటాన్, ఎలక్ట్రాన్, న్యూట్రాన్‌లనే పరమాణువులే వివిధ నిష్పత్తులలో ఉంటాయి. వాటినే మన ఆధ్యాత్మిక శాస్త్రాలు, సత్త్వ రజః తమస్సులంటాయి. ఈ పరమాణువులకన్నను సూక్ష్మతర తత్త్వాలు మరికొన్ని ఉన్నాయి. వాటిని ఎంతటి బలమైన ఎలక్ట్రానిక్ మైక్రోస్కోపుతోను కూడ చూడలేము. అవే 'నేను, నేను' అని వ్యవహరించే జీవాత్మలు. ఇవియును అనేకం. ఈ రెంటికన్నను 'సూక్ష్మతమ తత్త్వం' పరమాత్మ. అది జడమైన జ్ఞానంలేని పరమాణువులను జ్ఞానంగల జీవాత్మలను కూడా అన్నివైపుల నుండి ఆలింగనం చేసుకొని అన్నిటిలోనూ ప్రవేశించి, వ్యాపించి ఉన్నది. ఆ పరమాత్మ – విశ్వాత్మ సర్వవ్యాపకము, అఖండితము, సర్వజ్ఞము, సర్వశక్తిమంతము. ఆ దేవతయే – విశ్వాత్మయే మనకు ప్రియమైనది కావాలి. దానినే మనం ఉపాసించాలి, ప్రార్థించాలి. అది మన శరీరాలలోను, మనస్సులోను, బుద్ధిలోను చివరకు జీవాత్మలమైన మనలోను కూడా వ్యాపించి ఉన్నది. కనుక మనం అంతర్ముఖులమై ఉపాసించాలి. అదే మన మనోవాక్కాయలతో చేసే కర్మలకు అత్యంత న్యాయంగా ఫలాలనిస్తున్నది. కనుక, మనం అంతరాత్మనే ప్రార్థించాలి.

మరొకచోట ఆ సూక్ష్మతమ తత్త్వమైన దేవుని గురించి మరికొంత వివరిస్తూ ఏమంటుందంటే –

1. **ఈశావాస్యమిదం సర్వం యత్కించ జగత్యాం జగత్ –**

యజుర్వేదం (40–1)

సూక్ష్మతమతత్త్వమై అన్నిటిలో వ్యాపించి నడిపిస్తున్న ఈశుడు నియమాక శక్తి ఈ జగత్తులో ఏకించిత్ కలదో – అణు పరమాణువులలో కలదో అదే తత్త్వం విశ్వమంతటా వ్యాపించి గ్రహగోళాలన్నిటిని నియమించి నడిపిస్తున్నది. దాని గుణాలను, శక్తి సామర్థ్యాలను వివరిస్తూ మరొక మంత్ర మేమంటున్నదంటే –

2. **స పర్యగాత్ + శుక్రమ్ + అకాయమ్ + అవ్రణమ్ + అస్నావిరం**
శుద్ధమ్ అపాపవిద్ధమ్, కవిర్ మనీషీ పరిభూః స్వయంభూర్
యథాతథ్యతః + అర్థాన్ వ్యదధాత్ + శాశ్వతీభ్యః సమాభ్యః

– యజుర్వేదం 40–8

తాత్పర్యం: ఆ దేవతత్త్వం అంతటా, అన్నిటా వ్యాపించి యున్నది. అది సర్వశక్తిమంతము. స్థూల సూక్ష్మ కారణ శరీరాలేవీ లేనిది. వ్రణాలు ఛిద్రాలు లేనిది. నాడీ బంధనాలు లేనిది – ఏ శరీరాలను దాల్చదు. పాపపుణ్యాలతో బంధింపబడదు. అది కవి – వేద రచయిత, సర్వుల మనస్సులను ఎరుగగలదు. ఎంతటి దుష్టులనైన దండించగలదు. అది స్వయంగా ఉన్నది – దాని ఉనికికి మరొక కారణంలేదు. అట్టి దేవతత్త్వమే ఈ సృష్టిని యథాతథంగా – ఎట్లుండవలెనో అట్లు సృజించినది. ఈ సృష్టి ఎందుకనగా తనతో సమానంగా అనాదిగా ఉంటున్న అల్పజ్ఞ జీవుల కొరకే. తాను అనుభవించుట కొరకు కాదు.

3. ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే ।
తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్వత్ అన్యో అభిచాకశీతి ॥

– ఋగ్వేదం 1–164–20

తాత్పర్యం: పై ఋగ్వేద మంత్రం సృష్టిని అలంకారికంగా ఒక వృక్షంగా పేర్కొంటూ, జీవదేవుళ్ళను రెండు పక్షులుగా కల్పన చేస్తూ, అందులో ఒక పక్షి వృక్షఫలాలను తింటున్నదనీ మరొకటి తాను తినకుండా తింటున్న పక్షిని, వృక్షాన్ని జాగ్రత్తగా గమనిస్తున్నదనీ వర్ణిస్తున్నది. ఈ మంత్రం యొక్క వాక్యార్థ తాత్పర్యాలు ఈ పుస్తకం అట్ట వెనుక వ్రాయబడ్డాయి. అక్కడ చదువుకోగోరుచున్నాము.

ఇటువంటి వేదమంత్రాలు చాలా ఉన్నాయి. కనుక దేవ, జీవ, ప్రకృతులు మూడునూ వేరువేరుగా అనాదిగా అనంతకాలం వరకు ఉంటూనే ఉంటాయి. "బ్రహ్మసత్యం జగన్మిథ్య, జీవో బ్రహ్మైవ నాపరః" అనే మాటలు వేదసమ్మతం కాదు. ప్రస్థానత్రయం పుస్తకాలు అనేక అద్వైతాలను బోధిస్తాయా? ఆలోచించండి. వాటికి ఆర్య విద్వాంసులు వ్రాసిన భాష్యాలను చూడండి. వాటిని వేదాలకు అన్వయిస్తూ వ్యాకరణయుక్తంగా వారు వ్రాశారు. అందుకనే ముందు వేదాంగ ఉపాంగాలను అధ్యయనం చేసి అనంతరమే వేదాలను, ఋషులు వ్రాసిన గ్రంథాలను చదువాలని, భాష్యాలు వ్యాఖ్యానాలు చెయ్యాలని విజ్ఞులంటారు. లేకుంటే చాలా పొరపాట్లు వస్తాయి. జగత్ప్రసిద్ధమైన భగవద్గీత వేదోక్త త్రైతవాదాన్ని ఎంత చక్కగా ప్రతిపాదిస్తున్నదో ఈ క్రింది శ్లోకాలలో చూడండి –

శ్లో॥ ద్వా విమౌ పురుషౌ లోకే క్షరాశ్చాక్షర ఏవ చ ।
క్షర స్సర్వాణి భూతాని, కూటస్థోఽక్షర ఉచ్యతే ॥

శ్లో॥ ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః ।
యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః ॥

–భగవద్గీత 15–16, 17

ఈ శ్లోకాలలో దేవ జీవ ప్రకృతులను పురుషులుగా పేర్కొంటూ: లోకంలో (సృష్టిలో) ఇద్దరు పురుషులున్నారు. అందులో ఒకటి నశించేది, రెండవది నశించనిది. సర్వభూతాలు (పంచభూతాలు) వాటితో ఏర్పడిన పదార్థాలు నశించే గుణం కలవి. అంటే – మార్పు చెందుతూ చివరకు నశించిపోతాయి. ఇచట నాశనమంటే 'కారణలయః' – తనమూల కారణంలో (మూల పదార్థంలో) లయించి పోవటం. ప్రాకృతిక పదార్థాలన్నీ మూల ప్రకృతినుండి పుట్టాయి కనుక మరల మూల ప్రకృతిగా (అవ్యక్తంగా) మారిపోతాయి. అప్పుడు దానిని ప్రలయం అంటారు. 432 కోట్ల సంవత్సరాలు అట్లే ఉండి, మరల సృష్టిగా మారతాయి. అంటే – దేవుడు, ఆ జడ పదార్థాన్ని ఒకప్పుడు సృష్టిగాను తదుపరి ప్రలయంగాను మారుస్తూ ఉంటాడన్న మాట. రెండవ పురుషుడైన కూటస్థుడు – దేహేంద్రియ కూటమిలో ఉన్న జీవుడు అక్షరుడు. ప్రకృతి వలె మార్పు చెందనివాడు.

వీరిద్దరేకాక మరొక పురుషుడున్నాడు. అతడిని పరమాత్మగా వేద శాస్త్రాలలో పేర్కొనబడినది. అది త్రిలోకాలలోను (భూ అంతరిక్ష ద్యులోకాలను) ఆవహించి వ్యాపించి ఉన్నది. అది అవ్యయము. మార్పు చెందనిది. అంతేకాక అది ఈశ్వరుడు – అన్నిటికి (జీవ ప్రకృతులకు) స్వామి (Superintendent).

ఈ భగవద్గీత శ్లోకాలు దేవ జీవ ప్రకృతులను పురుషులంటున్నాయి. అంటే మగవారని కాదు. 'పురుష' పదమునకు బ్రహ్మాండ పురమంతా శయనించి – ఆక్రమించి ఉన్నాడు కనుక దేవుడు ఉత్తమ పురుషుడు. జీవుడు అణు పరిమాణుడే అయినా అతని శక్తి దేహపురమంతా శయనించి వ్యాపించి ఉంటుంది కనుక మధ్య పురుషుడు. ప్రకృతి సృష్టి అంతా శయనించి ఉంటుంది. విస్తరించి ఉంటుంది. అది జ్ఞానం లేని జడ పదార్థం. కనుక అది సామాన్య పురుషుడని పై శ్లోకాలలో పేర్కొనబడ్డాయి. ఈ మూడు తత్త్వాలు సృష్టిలోనేకాక మన శరీరాలలోను స్పష్టంగా అనుభవగోచరమౌతాయి. అది వైజ్ఞానికంగా కూడా ఉంటుంది.

మన శరీరంలో త్రైతవాదం – పూర్తిగా వైజ్ఞానికం

"ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే" అనే పూర్వ పుటలోని వేదమంత్రం మన శరీరానికి కూడా అన్వయిస్తుంది. అలంకారికంగా మన శరీరాన్ని వృక్షమనుకుంటే – ప్రకృతి అనుకుంటే దీనిలో రెండు పక్షులు (చేతన తత్త్వాలు) కనబడతాయి. అందులో ఒకటి మనం. జీవాత్మలం. నా కాలు, నా చేయి, నా తల అనుకుంటూ మనం శరీరంకన్నా వేరుగా ఉన్నాము. మనకు కొద్దిగా జ్ఞానం కూడా ఉంది. కనుక వేదం మనను సుపర్ణులు అంటుంది. జ్ఞానం, ప్రయత్నం (కర్మలు) అనే రెండు రెక్కలతో మన లక్ష్యం వైపు ఎగిరిపోతూ ఉంటాము. మనకు అభిరుచి గల అయా రంగాలలో ఉన్నతోన్నత శిఖరాలకు చేరుకుంటూ ఉంటాము.

మనకు శరీరం సాధనంగా ఉంటుంది. దానికి జ్ఞానం లేదు. అది మనం తినే ఆహారంతోనే పెరిగి పెద్దదయ్యింది. శక్తివంతమయ్యింది. ఆహారం భూమి నుండి వచ్చిందే కదా! త్రాగే పానీయాలు, పీల్చేగాలి, పంచభూతాలలోనివే కదా! వాటిలో జ్ఞానంలేదు కనుక వాటినుండి ఉత్పన్నమయిన ఆహార పానీయాదులలోను జ్ఞానం ఉండదు. జ్ఞానం లేని ఆహార పానీయాదులతో ఏర్పడిన శరీరంలో కూడా జ్ఞానం ఉండదు. అందుచే దానిని వృక్షంతో పోల్చింది వేదం. భూమినుండి ఉత్పన్నమయిన వృక్షం కొంతకాలం తదుపరి మరల భూమిలో కలిసిపోయినట్లే మన శరీరాలును కాలాంతరంలో భూమిలో కలిసిపోతాయి. కనుక శరీరం వృక్షంతో సమానం.

ఇక మూడవ తత్త్వం దేవుని గురించి వైజ్ఞానికంగా ఆలోచిద్దాము. మన శరీరంలో కాళ్లు చేతులు ఇంద్రియాలు మన స్వాధీనంలోనే ఉన్నాయి. ఏదైనా వ్యాధి ఉంటే తప్ప చాలావరకు అవన్నీ మనం చెప్పినట్టే వింటాయి. కాని గుండె, ఊపిరితిత్తులు, జీర్ణమండలం, రక్త ప్రసార లింఫ్ ప్రసార మండలాలు, మూత్రపిండాలు, వివిధ గ్రంథులు మన ప్రమేయం లేకుండా వాటంతట అవే చాల తెలివిగా నిర్విరామంగా పనిచేస్తున్నాయి. వాటిని ఎవరు పనిచేయిస్తున్నారు? అవన్నీ జ్ఞానంలేని ఆహార పానీయాలతో నిర్మింపబడినవే కదా! ఆధునిక వైద్యులు కొన్ని హార్మోన్ల ప్రభావంతో అవి పనిచేస్తున్నాయంటారు. కొందరు మెదడు పంపే

సంకేతాలవల్ల అంటారు. అవి కూడా ఆహార పానీయాలతో నిర్మింపబడినవే కదా! వాటిలో లేని జ్ఞానం ఆయా అవయవాలకెలా వచ్చింది? కొందరు శరీర కణాలలోని క్రోమోజోమ్స్ మరియు అందలి జీన్స్ కారణమంటారు. అవి కూడా మాంసకృత్ నిర్మితాలే. అవి కూడా జడములే. జ్ఞానం లేనివే. కొందరిలో ఆ జీన్స్ వక్రించి దీర్ఘవ్యాధులను, నయంకాని వ్యాధులను కలిగిస్తున్నాయి. ఎందుచేత?

ఒకవేళ వీటిని జీవాత్మ కలిగిస్తున్నదా? జీవాత్మలంటే మనమే కదా! మనకి మనం జీన్స్‌ను చెడగొట్టుకొని వ్యాధులను కలిగించుకుంటామా? అసలు మనకట్టి శక్తి, జ్ఞానం ఉన్నాయా? మనకు రుచిగా వండుకొని తినటం వరకు తెలుసు. గొంతు దాటి లోపలికి వెళ్ళి ఏ ఏ మార్పులు చెంది జీర్ణం అవుతున్నదో తెలియదు. ఏదైనా బాధ వస్తే తప్ప లేకుంటే కడుపు ఉన్నట్టే స్మృతి ఉండదు. అట్లే మన శరీరంలో ఎన్నెన్నో అవయవాలు గ్రంథులు ఉన్నాయి. వాటిలో ఏవైనా వ్యాధులు బాధలు వస్తేనే అవి మన స్మృతిలోకి వస్తాయి, లేకుంటే శరీరం ముప్వలాగా తేలికగా ఉంటుంది. ఎన్నెన్నో ఆటలు, కళలు అభ్యసిస్తాము. సత్కారాలను పురస్కారాలను అందుకుంటాము. కనుక అమ్మ కడుపులో మనకీశరీరాన్ని నిర్మించినదీ, ఇప్పుడు జీవింపచేస్తున్నది మరొక తత్త్వం ఉంది. అదే దేవతత్త్వం. ఈ విధంగా మన శరీరంలోనే ప్రకృతితత్త్వం, జీవతత్త్వం, దేవతత్త్వం ఉన్నాయి. త్రైతవాదం మన శరీరంలోనే ఉంది.

సూక్ష్మంగా ఆలోచిస్తే మన శరీరంలో ఎన్నో వింతలు విడ్డూరాలు కనబడతాయి. శరీర నిర్మాణ శాస్త్రం (Anatomy), శరీర ధర్మశాస్త్రం (Physiology) చదివితే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. మనం పీల్చుకునే గాలిలో ఆక్సిజన్‌కన్నా నైట్రోజన్ 3 రెట్లు ఎక్కువగా ఉన్నా ఊపిరితిత్తులు ఆక్సిజన్‌ను మాత్రమే గ్రహిస్తాయి. గుండె ఆ ఆక్సిజన్‌ను, ఆహార సారాన్ని శరీరంలోని ప్రతి కణానికి పంపిస్తుంది. రక్తం అక్కడున్న మలినాలను తీసుకెళ్ళి మూత్రపిండాలలో శుద్ధిచేస్తుంది. ఎంత చక్కని ఏర్పాటు! వాటిని ఆ విధంగా నిర్మించిన దేవతత్త్వం అనంతజ్ఞానం, అనంత శక్తి సామర్థ్యాలు గలదని అర్థమౌతున్నది కదా! ఇంతేకాక, మనం మనస్సుతో చేసే పాపపు ఆలోచనలను, సద్భావాలను కూడా కనిపెడుతూ ఉంటుంది. శరీరంతో, వాక్కుతో చేసే చెడుకర్మలకు చూచినవారు, విన్నవారు మనను కొంత శిక్షించవచ్చు. సాక్ష్యాలన్నీ ఋజువైతే కోర్టులు మరికొన్ని శిక్షలు

విధించవచ్చు. కాని మనసులో హత్య చేసే పథకాలను, కీడు చేసే ఆలోచనలను లోకంలో ఎవరు కనిపెట్టి శిక్షించగలరు? అట్టివాటికి కూడా దేవతత్త్వం తగిన విధంగా శిక్షిస్తుంది. ఆ ఆలోచనలు కార్యరూపం ధరించే సమయంలో ముందు దయతో హెచ్చరించి చూస్తుంది. భయాన్ని, సంకోచాన్ని కలిగించి చూస్తుంది. ఆ హెచ్చరికను, ప్రేరణను అర్థం చేసుకున్న బుద్ధిమంతులు ఆ చెడుకర్మ చేయకుండా ఇంద్రియాలను నిగ్రహించుకుంటారు. గీతలో (2-58లో) చెప్పినట్లు తనకేదైనా కీడు, ఆపద జరుగబోతోందని గుర్తిస్తే తాబేలు వెంటనే తన తలను, కాళ్లను లోపలకి ముడుచుకొని ఒక డిప్పలా అయిపోతుంది. అట్లే స్థితప్రజ్ఞుడు (బుద్ధిమంతుడు) అంతర్యామి ప్రేరణలను గుర్తించి తన యింద్రియాలను నిగ్రహించుకుంటాడు. ఆ చెడుపని చేయకుండా ఆగిపోతాడు పశ్చాత్తాపపడతాడు.

అట్లే, మనం ఏదైనా మంచిపనులు - దాన ధర్మం త్యాగం పరోపకారం మొదలగునవి చేస్తున్నప్పుడు మనకు లోపలినుండి ఆనందం, ప్రోత్సాహం, ధైర్యం, సహనం మొదలగునవి కలుగుతాయి. కనుకనే మనదేశ స్వాతంత్ర్య సమరంలో దేశభక్తులు, క్రాంతికారులు అంతటి పెద్ద పెద్ద శిక్షలను, క్రూరమైన హేయమైన శిక్షలను కూడా 'వందేమాతరం' అనుకుంటూ సంతోషంగా అనుభవించారు. మనకు స్వాతంత్ర్యాన్ని సంపాదించి పెట్టారు. ఇట్టి అంతర్యామి ప్రేరణలే దైవతత్త్వం ప్రత్యక్షమౌతున్నట్లు నిరూపిస్తున్నాయంటారు దయానంద మహర్షి తమ 'సత్యార్థ ప్రకాశం' సప్తమ సముల్లాసంలో. ఇది చాలా సూక్ష్మ విషయం దానిని అక్కడ మహర్షి మాటలలోనే చదవండి. ఆయన అక్కడ ప్రత్యక్ష, అనుమాన, శబ్దాది అన్ని ప్రమాణాలతోను సరియైన దైవతత్త్వాన్ని తర్కంతో నిరూపించారు. **"యత్తర్కేన అనుసందత్తే స ధర్మః"** - తర్కానికి నిలబడేదే ధర్మం అంటారు మన మహర్షులంతా. మనం వారి మార్గాన్ని అనుసరించటమే ఉత్తమం. మూఢ నమ్మకాలతో ముక్తి పొందటం అసాధ్యం. మనం ఏ రూపాన్ని ధ్యానిస్తే ఆ రూపంలోనే దేవుడు దర్శనమిస్తాడని కొందరు గురువులు ఉపదేశిస్తూ ఉంటారు. ఇది వారి వట్టి భ్రమ. దేవుడు ఎలా ఉంటాడో సరిగా తెలుసుకొని ఉపాసించమని వేదం స్పష్టంగా చెబుతుంది.

"తమేవ విదిత్వా అతి మృత్యుమేతి నాఽన్యః పంథా విద్యతే అయనాయ" - యజుర్వేదం (31-18) అంటుంది. మరొక మార్గం లేనే లేదంటుంది. స్వాహా - ఇది పూర్ణ సత్యం.

ముగింపు మాటలు (CONCLUSION)

ప్రియ పాఠకులారా!

ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రంలో వివిధ మతాలు సంప్రదాయాలు అన్నీ దేవ జీవ ప్రకృతుల విషయంలోనే భిన్న భిన్న అభిప్రాయాలు కలిగి ఉన్నాయి. వారు నమ్మిన గ్రంథాలు, గురువులు చెప్పేదే సత్యమని నమ్మి దానిని అనుసరిస్తున్నారు. ఎవరి నమ్మకం వారిదంటున్నారు. కేవలం గట్టి నమ్మకమే దేవున్ని చేరుస్తుందంటున్నారు. కాని మనం నమ్మినట్టు సృష్టి, సృష్టిలోని పదార్థాలు ఉండవు. వాటి యథార్థ స్వరూపం ఏమిటో మనమే పరిశోధించి తెలుసుకోవలసి వస్తుంది. దేవ జీవ మూల ప్రకృతులు మూడూ సూక్ష్మ విషయాలు. వాటిని మన ఇంద్రియాలతో గాని సూక్ష్మదర్శిని, దూరదర్శిని మొదలైన వాటితోగాని తెలుసుకోలేము. కేవలం బుద్ధితో మాత్రమే తెలుసుకోగలం. కనుకనే యోగేశ్వర శ్రీకృష్ణుడు "బుద్ధిగ్రాహ్యం అతీంద్రియం" అన్నాడు భగవద్గీతలో.

మేమింతవరకు దేవ జీవ ప్రకృతులను గురించి సంక్షిప్తంగా, స్పష్టంగా, హేతుబద్ధంగా, వైజ్ఞానికంగా మీ ముందుంచాము. కనుక సృష్టికర్త మీకిచ్చిన బుద్ధిని పదును పెట్టుకొని సద్వినియోగం చేసుకోండని విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ విషయాలను మీ బుద్ధితో మనన చింతనలు చేసి సత్యాన్ని గ్రహించండి. అసత్యాన్ని వదిలిపెట్టండి. సత్యమని నమ్మినదానిని ఆచరించండి. ప్రచారం చెయ్యండి. హోమియో వైద్య పితామహుడైన డా. హానిమన్ ఎమ్.డి. (జర్మనీ) ఏమన్నాడంటే – "Aude Sapare - Dare to be wise – విజ్ఞాన వంతుడగుటకు సాహసింపుడు" అన్నాడు. సంస్కర్తలంతా అదే చేశారు. కనునకనే ఎంతోమంది రక్షింపబడ్డారు. తరతరాలు వారిని స్మరిస్తున్నారు. ప్రేరణను పొందుతున్నారు. కనుక మీరును వారి మార్గాన్ని అనుసరించండి.

సర్వాంతర్యామియైన దేవుడు మీకు వివేకబుద్ధిని ప్రసాదించునుగాక! మార్గదర్శనం చేయునుగాక! మీరంతా అభ్యుదయంతో బాటు నిఃశ్రేయసాన్ని – సర్వదుఃఖ నివృత్తిరూప మోక్షాన్ని పొందుదురుగాక!

ఓ3మ్ శాన్తిః శాన్తిః శాన్తిః

– సుమ్నార్థి

(గ్రంథకర్త)

వైదిక శాంతిపాఠం
Vedic Shanthi Prayer

ఓం ద్యౌః శాంతి రంతరిక్షగ్ం శాంతిః, పృథివీ శాంతి
రాపః శాంతిః, ఓషధయః శాంతిః వనస్పతయః శాంతిః ।
విశ్వేదేవాః శాంతిః బ్రహ్మశాంతిః సర్వగ్ం శాంతిః,
శాంతిరేవ శాంతిః, సా మా శాంతి రేధి ॥

-యజుర్వేదం 36-17

ద్యులోకము, అంతరిక్షము, భూమి జలము, ఓషధులు, వనస్పతులు ఎల్ల విద్వాంసులు, వేదము, సంపూర్ణ ప్రపంచము, స్వయముగా శాంతియై శాన్తి నిచ్చుగాక! ఆ శాంతి నన్ను చేరి వర్ధిల్లు గాక!

May sky be peaceful. May atmosphere be peaceful. May earth be peaceful. May waters be peaceful. May medicinal herbs be peaceful. May plants be peaceful. May all the learned persons be peaceful. May God and the Vedas be peaceful. May all the objects be peaceful. May peace itself be peaceful. May that peace come unto me.

గాయత్రి ఆశ్రమ ట్రస్టు

12-10-586/6, ఆర్య సమాజము,
వారాసిగూడ, సికింద్రాబాద్-500 061.
(ఇందిరానగర్ రోడ్డు - 2)
సెల్ : 9848011073,
9908994084

Bill No.:

Date : ....

To : ....

....

....

S.No.	Particulars	copies	Rate	Amount
	డా॥ కోదూరి సుబ్బారావు గారి రచనలు			
1.	గాయత్రీ విజ్ఞానం		100.00	
2.	వేదార్థ విజ్ఞానం		100.00	
3.	వేదాలలో సూర్యకిరణ చికిత్స		80.00	
4.	వేదాలలో సార్వజనిక నియమములు		80.00	
5.	మన ఇతిహాసం		70.00	
6.	మన వేదశాస్త్రాల పరిచయం		70.00	
7.	అగ్నిహోత్రం 100 శాతం వైజ్ఞానికం		60.00	
8.	వేదాలలో జలచికిత్సా విజ్ఞానం		60.00	
9.	జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ		60.00	
10.	వేదాలలో దేశభక్తి		60.00	
11.	పెండ్లినాటి ప్రమాణాలు		50.00	
12.	గర్భాధాన విజ్ఞానం		50.00	
13.	సంధ్యావందనం-వైజ్ఞానిక సమాలోచన		50.00	
14.	వేదామృతం		50.00	
15.	గణపతి రహస్యము, శివరాత్రి రహస్యము		50.00	
16.	వేదాలలో మనోవిజ్ఞానం		50.00	
17.	వైదిక ధర్మం అంటే?		50.00	
18.	అగ్నిహోత్ర రాసాయనిక విశ్లేషణ		40.00	
19.	గోమాత		40.00	
20.	దౌహృదిని		40.00	
21.	మరణానంతరం జీవుని ప్రయాణం		40.00	
22.	మానవ ధర్మము		40.00	

23.	పండుగల పరమార్థం		40.00	
24.	వైదిక క్రాంతి పథం		40.00	
25.	ఈశావ్యమిదం సర్వం		35.00	
26.	గాయత్రీ మహిమ		30.00	
27.	యజ్ఞో వై శ్రేష్ఠతమమ్ కర్మ		–	
28.	దేవుడు – జీవుడు – ప్రకృతి		30.00	
29.	వేదాల వెలుగుచూపే ఆర్య సమాజము		30.00	
30.	వైదిక జన్మదిన వేడుక		30.00	
31.	వైదిక గృహప్రవేశ విధి		30.00	
32.	వేదాలలో వర్షేష్టి విజ్ఞానం		30.00	
33.	వేదాలలో అశ్వనీ దేవతలు		30.00	
34.	పురుష సూక్తము		30.00	
35.	వైదిక శాంతి పాఠం (వైజ్ఞానిక వ్యాఖ్య)		20.00	
36.	సృష్టికథ		20.00	
37.	సరస్వతీ సూక్తము		20.00	
38.	విశుద్ధ లక్ష్మీ సూక్తము		20.00	
39.	వైదిక సంస్కృతిలో వానప్రస్థాశ్రమము		20.00	
40.	స్వతంత్ర సముపార్జనలో దయానందుడు		20.00	
41.	గంగాధర శివుడు		20.00	
42.	చతుర్దశ భువనములు		20.00	
43.	యజ్ఞోపవీత వైశిష్ట్యము		60.00	
44.	చతుర్వేద మంత్ర రత్నాలు*		120.00	
45.	విశిష్ట వేద సూక్తములు*		150.00	
46.	వైదిక విజ్ఞానము*		60.00	
	ఇతర విద్వాంసుల రచనలు			
1.	మాతా పుత్రికల జ్ఞాన చర్చ		60.00	
2.	వేదాలలో విజ్ఞాన బీజాలు		30.00	
3.	స్వరాజ్య సంగ్రామములో ఆర్య సమాజము		20.00	
4.	మరికొన్ని చిన్న పుస్తకాలు ఒక్కొక్కటి		10.00	
	** పోస్టల్ ఖర్చులు అదనం **		Total	

2వ టైటిల్

ఓ అంతర్యామీ! నాకు మేధస్సు నిమ్ము

ఋషిః – కణ్వః   దేవతా – మేధా

ఓం యామ్+ఋషయో భూతకృతో మేధాం మేధావినో విదుః ।
తయా మామద్య మేధయాగ్నే మేధావినం కృణు ॥

– అథర్వవేదం 6-108-4

హే అగ్నే! ప్రకాశ స్వరూప పరమాత్మా! ఏ మేధాబుద్ధిని ఋషులు, మహర్షులు ఉపాసించినారో – పొందటానికి తపించినారో, మేధావులంతా ప్రయత్నిస్తున్నారో అట్టి మేధాబుద్ధిని నాకిప్పుడే ప్రసాదింపుము.

(ఋషి అంటే – "ఋషిర్దర్శనాత్ యోగాభ్యాసం చేస్తూ సమాధి స్థితిలోనికి వెళ్ళి అంతర్యామి నుండి ఆ వస్తు జ్ఞానాన్ని పొందినవాడు" అని అర్థం. ఆయా పదార్థాల యొక్క యథార్థ స్వరూపాన్ని దర్శించాలి. దీనినే యౌగిక ప్రత్యక్షం అంటారు.)

O Self - refulgent God! Swayam Prakasha! make me wise with that of the knowledge which the wise seers of the primal emergence (Ritambara Prajna) attain and ratain.

4వ టైటిల్

ఓం ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే ।
తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి+అనశ్వత్+అన్యో అభిచాకశీతి ॥

– ఋగ్వేదం 1-164-20

వాక్యార్థం:

ద్వా సుపర్ణా సయుజా సఖాయా = మంచి రెక్కలు గల రెండు పక్షులు – జీవాత్మ పరమాత్మలు వ్యాప్యావ్యాపకములుగా కలిసియున్నవి. ఎప్పుడూ అవి రెండును మిత్రులే – అనాదులే.

సమానం వృక్షం పరిషస్వజాతే = ఈ రెండు వృక్షరూప విశ్వంలో వసించుచున్నవి.

తయోర్ + అన్యః పిప్పలం స్వాదు + అత్తి = వాటిలో ఒకటి – జీవాత్మ సృష్టి వృక్షంలోని ఫలములను – విషయాలను తింటున్నది – అనుభవిస్తున్నది.

అనశ్వత్ + అన్యః + అభిచాకశీతి = మరొకటి – పరమాత్మ. తా నే విషయాలను అనుభవించకుండా అన్నిటిని చక్కగా పరిశీలిస్తున్నది.

Two birds like substances - God and soul whose acts and knowledge are beautiful in their spheres and who are residing together and like friends, rest on the tree like meterial cause, the utter which is of the time of same eternity. One of the twain the soul eats the sweet and palatable fruit of the tree which the other (God) eating not, sees like an indifferent spectator.